# ఆసురసంధ్య

## శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

(గతసంచిక తరువాయి)

### 6

శేషాద్రిగారి నొకసారి చూచిరావా లనిపించింది శ్రీధర్‌కు.

శేషాద్రి కాలేజిలో ఇంగ్లీషు లెక్చరర్. దివ్యజ్ఞాన సమాజంలో చేరి యిరవైయేళ్ల క్రితం మదనపల్లికి తరలివచ్చాడు. అంతకుపూర్వం ప్రెసిడెన్సీ కాలేజీలో పని చేశాడు కాని అకస్మాత్తుగా భార్య పోవడంతో మనోవైకల్యం కలిగి ఉద్యోగానికి రాజీనామా యిచ్చాడు. తర్వాత దివ్యజ్ఞాన సమాజంతో సంబంధము ఏర్పడి, వాళ్ళ ఆధ్వర్యాన నడుపబడుతున్న మదనపల్లి కాలేజికి, తక్కువ వేతనంమీదే అయినా, సేవా ప్రవృత్తితో, అధ్యాపకుడుగా వచ్చాడు. ఆయనొక విచిత్రవ్యక్తిగా, పారలౌకికమైన ఉన్మాదంతో అప్పుడప్పుడు ఎవరికీ అర్థంకాని పనులు చేస్తుండే వేదాంతిగా పరిగణిస్తారు విద్యార్థులు. కిట్టనివారు అదొక వేషధారణ అంటూ విమర్శిస్తారు. పాఠం చెప్పటంలో వేదాంత ప్రసక్తి మోతాదు తగ్గించినరోజు ఆయన్ని మించిన బోధకుడు, వక్త ఉండడని విద్యార్థుల ఏకాభిప్రాయం.

శ్రీధర్ ఇంటరులో చేరగానే శేషాద్రిగారి ప్రభావానికి లోనయ్యాడు. పాఠాన్ని విడిచిపెట్టి ఆయన మధ్యమధ్య చేసే ప్రసంగాలే ఎక్కువ నచ్చేవి శ్రీధర్‌కు.

శ్రీధర్ ఇంటరులో చేరిన సంవత్సరం 1942 స్వాతంత్ర్య విప్లవోద్రిక్తతతో దేశం ఉప్పొంగిన కాలం. ఆగస్టు నెలలో ఇరవై రోజులు తరగతులకు వెళ్లకుండా సమ్మె చేశారు విద్యార్థులు. మదనపల్లి కాలేజీకి బిసెంటు సతి ద్వారా స్వాతంత్ర్యోద్యమంతో, పూర్వంనుంచీ సంబంధం ఉండటం మూలాన సమ్మె విజయవంతంగా సాగింది. దివ్యజ్ఞాన సమాజపు అధినేతలు 'క్విట్ ఇండియా' ఉద్యమానికీ అప్పటి సమ్మెకూ వ్యతిరేకులే అయినా కాలేజి అధ్యాపకులూ, విద్యార్థులూ, ఉన్ముఖులే కావటంతో సమ్మె నిరాటంకంగా ప్రశాంతంగా కూడా జరిగింది. రోజూ కాలేజికి వెళ్లటం, తరగతుల్లోకి మాత్రం పోకుండా లైబ్రరీలోనో, చెట్లక్రిందనో కాలక్షేపం చెయ్యటం మామూలైంది ఆ సమ్మెరోజుల్లో. ఆ సమయంలో శేషాద్రిగారు ఒకగంట తన చుట్టూ చేరిన విద్యార్థులకి చెట్లక్రిందనే ఉపన్యాసం యిచ్చేవారు. అది రాజకీయాలను గూర్చి ప్రసంగం అనటానికీ వీల్లేదు. లేక వేదాంతమో, నైతిక విషయమో, సారస్వత విషయమో అనటానికీ వీల్లేదు; అదొక దార్శనిక కవిత్వం వంటిది. అందులో అన్ని విషయాలూ మిళితమైన ఒక పారలౌకిక స్వప్నం గోచరమయ్యేది . . . . . .

"విశ్వాంతరాళంలో మేఘాలు : భూమిమీద శ్మశానం : హింస, రక్తపాతం, కార్చిచ్చు అపరనిశీథంలో ఒక ముహూర్తాన ఏదో పిలుపు వినవచ్చింది.... భరతమాత, అన్నపూర్ణా స్వరూపిణి చేత ప్రేమామృత భాండాన్ని పూని, అశ్రుసిక్త వదనంతో కారుణ్యోజ్జ్వల నేత్రాలతో నడిచివచ్చింది .... పసిపాపలు కిసలయ కోమల తారుణ్యంతో మెరిసే లలిత రమణీయ, మూర్తులు—మానవతాదర్శాలు— ఆమె చేలాంచలాన్ని విడువక ముద్దునడలతో మెల్లమెల్లగా అడుగులు వేస్తున్నారు. ..... బిడ్డలార ! మీరు హింసాత్మకమైన చర్యలని వర్జిస్తారని నా నమ్మకం ...." అలా ఎప్పుడో ఒక వాక్యం ఉన్నట్లుండి మెరుపులా మెరిసి ఆయన కవితా చిత్రానికి వెలుగై, ఆ స్వప్నాన్ని ఒక్కసారిగా భూమికి దించేది.... కాని, అంతలోనే మరొక స్వప్నం రివ్వున పైకెగసిపోయి ఆకాశంలో స్వేచ్ఛగా విహరించేది; ఒక్కొక్కసారి అది దృష్టికి అనకుండా, నేలకు దిగకుండా అలానే అదృశ్యమైపోయేది కూడా !

శేషాద్రిగారి వాగ్ధార, కల్పన, భావోద్వేగమూ శ్రీధర్‌ని ఒక రమ్యమైన ఉదాత్తమైన భావ ప్రపంచంలో ప్రవేశపెట్టేవి. అది కైలాస శిఖరారోహణమై ఆ భావనా ధావళ్యం అప్పుడప్పుడు సప్తవర్ణాల ఇంద్రధనస్సులా పృథఃకరణ చెందేది— విద్యార్థినులు కూడా అక్కడ చేరి శేషాద్రి ఉపన్యాసం వినటం తటస్థిస్తే ! .... ఇదంతా ఒక మధురస్మృతి శ్రీధర్‌కు యిప్పటికీ.

ఇంటరు సీనియర్‌లోకి వచ్చాక శేషాద్రిగారిని ప్రత్యేకంగా రెండు మూడుసార్లు కలిసికొని, వ్యక్తిగతమైన పరిచయం వృద్ధిచేసుకోవాలని ప్రయత్నించాడు శ్రీధర్. కాని శేషాద్రిగారు ఎక్కువ ఉత్సాహంగా ఉన్నట్లు కనిపించలేదు. ఆయన దగ్గర ఆధ్యాత్మిక విషయాల్లో, దివ్యజ్ఞానం పట్ల తన ఆసక్తిని ప్రకటించాడు శ్రీధర్. అందు కాయన "The other side of Death" అనే పుస్తకాన్ని యిచ్చి "దీన్ని చదివి చూడు" అన్నారు. శ్రీధర్‌కు ఆ పుస్తకం ఎక్కు- రుచించలేదు. కొన్నాళకు దాన్ని తిరిగి యిచ్చేశాడు కొం- భాగమే చదివి . . . . .

మద్రాసు లయోలా కాలేజికి వెళ్లిన తర్వాత, సైన్సు మీద అభిమానం పెరిగి శ్రీధర్ దివ్యజ్ఞాన సమాజంవాళ్లని గూర్చి ఎక్కువగా ఆలోచించటం మానేశాడు. శేషాద్రిగారిని కూడా ఒకరకపు రసోన్మాదిగా లెక్క వేసుకున్నాడు.

విద్యార్థిదశ గడిచి జీవితంలో అడుగుపెట్టడం, నాగ రాజుతో స్నేహబంధాన్ని త్రెంచుకొన్న పరిస్థితులూ, సత్యం—అసత్యం అన్న సందిగ్ధాన్ని ఎటూ తేల్చుకోలేకపోవడం, శ్రీధర్ మనస్సుని శేషాద్రిగారి వైపునకు మళ్లించాయి ప్రస్తుతం. ఆయనతో ఒక్కసారి సంప్రదిస్తే బహుశా తనకు కర్తవ్యం గోచరం కావచ్చుననే ఆశాభావం తోచింది.

శేషాద్రిగారు ఏదో వ్రాసుకుంటున్నారు. శ్రీధర్‌ను చూచి చిరునవ్వుతో ఆహ్వానించారు. వ్రాస్తున్నదాన్ని డ్రాయరులో పెట్టేశారు. "ను వ్విప్పు డేం జేస్తున్నావ్?" అంటూ కుశల మడిగారు.

శ్రీధర్ మద్రాసులో తను చేసిన ఉద్యోగం సంగతి చెప్పి, వ్యవసాయంలోనే ప్రవేశిద్దామని అనుకుంటున్నాను" అన్నాడు.

"మంచిదే" అన్నారు శేషాద్రిగారు.

తర్వాత యిద్దరిమధ్యా నిశ్శబ్దం.

"ఏదైనా పని ఉండి వచ్చావా ?" అని అడిగారు శేషాద్రిగారు.

"లేదు .... మిమ్మల్ని చూచిపోదామని వచ్చాను .... నేను ఇంటరు చదివే రోజుల్లో ఎన్నో విషయాలు తెలుసుకున్నాను మీదగ్గర.... ఆదర్శాలనేవి వూరికే మనస్సుని ఉదాత్తపరిచేవేనా, వాటికి నిత్య జీవితంతో ప్రమేయం ఏమైనా ఉందా ? అని ఒక సందేహం ...."

శేషాద్రిగారు ఒక్క క్షణం ఆలోచించి చిరునవ్వు నవ్వుతూ తల పంకించారు. "ఏం, మనస్సుని ఉదాత్త పరచటం మాత్రం తక్కువా ? అది చాలదా ?" అన్నారు.

"అయితే ఆదర్శాల ప్రయోజనం అంతకుమించి లేదని అంటారా మీరు ?"

"నేనేమీ అనను. ఆ విషయం ఎవరికి వారు నిర్ణయించుకోవలసిందే !"

"నా కదే అర్థం కావటంలేదు. అది ఎలా నిర్ణయించుకోవటం ? చూడండి, గాంధీమహాత్ముడు అహింసా సూత్రంమీదే స్వాతంత్ర్యంకోసం పోరాడినా దేశంలో రక్తపాతం తప్పలేదు చివరకు .... సైన్యాన్ని పురికొల్పిగాని హైద్రాబాదు ప్రజలకు విముక్తి కల్పించలేకపోయాం ఇవ్వాళ .... కారణ మేమంటారు ?"

"చూడు శ్రీధర్, సాముదాయకంగా దేశం గాంధీగారిని కొంతమేర, కొంతకాలమే అనుసరించగలిగింది, అడుగులో అడుగు వేయగలిగింది. అందులోనూ ఎన్నిసార్లు తప్పటడుగు వేసిందో కూడా గత ముప్పై ఏళ్ల చరిత్ర తిరగ వేసి చూస్తే తెలుస్తుంది. ఇక గాంధీగారి సారథ్యం పోయిన తర్వాత దేశం ఏ ధోరణిలో నడుస్తుందో వేరుగా చెప్పాలా? దానికి సహజమైన ధోరణిలోనే అది నడుస్తుంది ! ! అంటే ఏమిటి ? గత శతాబ్దాల చరిత్రలో యిక్కడ భిన్న సంస్కృతులూ, భిన్న మతాలూ ఎన్నో వచ్చి మేళవించాయి, ఘర్షణ పడ్డాయి. ఫలితంగా మనదేశ మొక సంకలన వ్యవస్థ. ఈ వ్యవస్థలోని భిన్న శక్తులకు సమైక్యం అంత సులువుకాదు, అది ఇంతవరకు పూర్తికాలేదు కూడా. గాంధీగారిది కేవలం ఒక ప్రయత్నం మాత్రమే. ఆ ప్రయత్నం ఒకవైపు రాజకీయ స్వాతంత్ర్యము తెచ్చిపెట్టినా, ఇంకొకవైపు అదే కారణంగా సమైక్యాన్ని సాధింపలేకపోయింది ! ఇది నగ్నసత్యం ! ప్రచారపు ధోరణిలో కాకుండా చారిత్రకదృష్టితో ఆలోచిస్తే దేశం గాంధీ మార్గంలో నడవటంలేదన్న విమర్శకు పెద్ద విలువ లేదు ! దీనికి కారణం ఒక దృష్టిభ్రమ. ప్రతి వ్యక్తీ సంఘాన్నీ దేశాన్నీ విమర్శించటంతో తన బాధ్యత తీరిందనుకుంటాడు; పరమానందయ్యశిష్యులు పదిమందీ, ఒక్కొక్కడు తన్ను విడిచి మిగతా తొమ్మిదిమందినీ లెక్కపెట్టి పదోవాడేమయ్యాడని విచారించినట్లు సంఘం, దేశం అంటే తన్ను మినహాయించి మిగతావాళ్లు అన్నట్లు మాట్లాడుతాడు. వ్యక్తి ఆచరణలో మార్పురానిది దేశం పోకడలో ఏమీ మార్పు రాదు. విమర్శించే చూపు 'సముదాయం' మీద నుంచీ 'వ్యక్తి'మీదకు మళ్లించటం మొదటిమెట్టు; వ్యక్తి అంటే తనూ తన అంతఃకరణా అని తెలుసుకోవటం రెండవమెట్టు. ఇలా విశ్లేషించిన తర్వాత ఆదర్శాల ప్రయోజనం, జీవితంలో వాటి ప్రసక్తి అర్థమౌతుంది. అలాకాకుండా దేశాన్ని గూర్చి చేసే విమర్శలూ, ఉద్బోధనలూ కేవలం రాజకీయ ప్రచారం, వాటికి విలువలేదు..."

"నే నడిగే ప్రశ్న వ్యక్తికి సంబంధించిందే; మీరు చక్కగా విడమర్చి చెప్పారు. గాంధీగారి సూత్రాలు 'సత్యం', 'అహింసే' తీసుకుందాము. 'సత్యం' అంటే ఏమిటి ? దాన్ని గూర్చి ఒక వ్యక్తి ఎలా నిర్ణయానికి రావాలి ?"

"ఇవి యిలా చర్చిస్తే సాధింపబడే విషయాలు కావు. తోచినదారిలో వెళ్లాలి. ఎవరికి వారు సాధించాలి."

"పోనివ్వండి, దివ్యజ్ఞాన సమాజంవారి ప్రకారం 'సత్యం' అంటే ఏమిటి ?"

శేషాద్రిగారు ఉద్రిక్తతను కనబరిచారు : "దివ్యజ్ఞానంవారి 'సత్యం', గాంధీగారి 'సత్యం' వీటిని గూర్చి తెలుసుకోవాలంటే వాళ్ల వాళ్ల పుస్తకాలు చదువు శ్రీధర్, నన్నడిగి ప్రయోజనం ఏమిటి ? నా కా సూత్రాల్ని బోధించే వోపిక లేదు. నీకు బహుశా తెలీదేమో నేను థియోసఫిస్టునీ కాదు, గాంధీ ప్రచారకుణ్ణీ కాను !"

శ్రీధర్‌కి ఆశ్చర్యం కలిగింది. ఈయన థియోసఫిస్టు కాకపోవటం ఏమిటో ? శేషాద్రిగారి వ్యక్తిత్వంలోని అర్థంకాని తనమేమిటో ప్రత్యక్షంగా అనుభవమైంది. కాని, తన సందేహాన్ని గూర్చి ప్రసంగించకుండా ఆయన్ని వదలకూడదనే పట్టుదల కూడా హెచ్చింది శ్రీధర్‌లో. సవినయంగా ప్రారంభించాడు.

"ఇది నాకు ముఖ్యమైన, వ్యక్తిగతమైన సమస్య— అందుకే మీ దగ్గరకు వచ్చాను, ఆశాభావంతో"..... శ్రీధర్

కంఠం వణికింది ..... "మీరు చెప్పినట్లు పుస్తకాలు చదివితే అది మనస్సును ఉదాత్తంచేసే వూహాగానంగానే ఉంది కాని నాకు కావలసిన జవాబు అందులో కనిపించదు. మరి నాకు నేను ఎలా నిర్ణయించుకోవాలో తెలీటంలేదు, ఏం చెయ్యమంటారు ?"

"ఏమిటి నీ సమస్య ?"

శ్రీధర్ నాగరాజు సంగతి క్లుప్తంగా చెప్పి తను మిత్రుడినుంచీ ఎలా వేరుపడ్డాడో, తర్వాత డబ్బు విషయమై ఇబ్బందిపడి మేనత్త దగ్గర ఎలా అబద్ధమాడాడో చెప్పాడు. తను సత్యవ్రతాన్ని నిలుపబెట్టుకున్నాడో లేదో ఎంత ఆలోచించినా తేల్చుకోలేకుండా ఉన్నట్లు వివరించాడు.

శేషాద్రిగారు అన్నారు : "ఇది కేవలం ఆలోచనతో, వాచ్యార్థం సమర్థించుకోవడంతో తేలే సమస్య కాదు. నీకు మానసికమైన జ్ఞానానికీ, ఆత్మగతమైన జ్ఞానానికీ తేడా ఉంటుందని తెలీటంలేదు. అలాగే సత్యం కూడా మానసికంగా ఆత్మగతంగా రెండు విధాల ఉంటుంది. పుస్తకాలనుంచీ, చర్చించటం నుంచీ యితరుల సత్యాన్వేషణ గురించి—గాంధీగారి 'సత్యం', దివ్యజ్ఞానంవారి 'సత్యం' అంటూ—తెలుసుకునేది కేవలం మానసికమైన జ్ఞానం. దానితో ఆత్మగతమైన సత్యం యొక్క స్వరూపం తెలీదు. నా సలహా ఏమిటంటే : నువ్వు సత్యాన్ని గూర్చి యీవిధంగా ఆలోచించటం మానివెయ్యి. ఇతరులపట్ల నీకున్న ప్రేమ, సహనమూ ఎంతవరకో అన్వేషించు. కోపం, ద్వేషం, అసహ్యం ప్రవేశించని సంబంధాల్లో అసత్యానికీ ప్రవేశం ఉండదు. అప్పుడు నీమాట వాస్తవానికి సూటిగా లేకపోయినా పెద్దగా భేదం అక్కరలేదు. ఏ భాష అయినా దానికీ, వాస్తవానికీ ఒక దూరం అంటూ ఉండక తప్పదు కదా !... ఏమాట నువ్వు వాడినా దాన్ని గ్రహించే వ్యక్తియొక్క మనస్సునీ, హృదయాన్నీ బట్టే ఉంటుందికదా గోచరమయ్యే అర్థం ! ..... నీలో ప్రేమను పెంచుకుని, యితరులతో ఆ ప్రేమను పంచుకోవటంతో వాళ్లతో హృదయైక్యం, వాళ్ల మనసుల్తో కలయిక సిద్ధిస్తాయి. దానివల్లే ఆత్మగతమైన సత్యమూ సాధింపబడుతుంది. ఇదీ నాకు తోచిన పద్ధతి...."

శేషాద్రిగారు వేదికమీద ఉన్నప్పుడు దూరంనుంచీ ఒక విధంగా కనిపించేవారు. ఏకాంతగోష్ఠిలో దగ్గరనుంచీ ఇంకో విధంగా కనిపించారు నేడు. శ్రీధర్ మనస్సులో ఏర్పడిఉండిన మొదటి చిత్రం చెరిగిపోయి దాని స్థానంలో క్రొత్త చిత్రం రూపొందించింది శేషాద్రిగారి వ్యక్తిత్వాన్ని గూర్చి. మొదట తనకు తెలిసిన శేషాద్రి వక్త, కవి, భావకుడు. ఇప్పటి శేషాద్రి సున్నితంగా మనస్తత్వ పరిశీలన చేయగల మేధావి. శేషాద్రి గారికి ఆవేశమే కాని ఆలోచనా పటుత్వం లేదనిపించేది పూర్వం.. .... ప్రస్తుతం ఆయనలో ఎక్కడా ఆ కవిత్వావేశపు ఛాయలే కానరాలేదు ! ఇంతటి భిన్నత్వానికి కారణ మేమిటో !

శ్రీధర్ శేషాద్రిగారి దగ్గర సెలవు తీసుకుని బయల్దేరాడు. అతని మనస్సు బరువుతగ్గి తేలిగ్గా ఉంది. హైస్కూలు చెరువుగట్టువైపు వెళ్లాడు. చీకటిపడుతోంది. ఆంజనేయస్వామి గుళ్లో గంటలు వినిపించాయి. ఆరోజు ఆదివారం కావటం గుర్తువచ్చి కోవెలవైపు నడిచాడు.

కోవెలలో జనం చాలమంది ఉన్నారు.ఆడవాళ్లు ఎక్కువ మంది. గర్భగుడివైపు వెళ్లటానికి వాళ్లని ఒత్తిగించుకొని వెళ్లాలి, లేదా వాళ్లు వెనక్కి మళ్లేదాకా వేచిఉండాలి. శ్రీధర్ వేచిఉన్నాడు...

సన్నజాజుల పరిమళం, దివ్వెలో నూనె కాలుతూన్న వాసన, ఆడవాళ్ల సాన్నిహిత్యం, సమ్మర్దంవల్ల వేడెక్కిన వాతావరణం .... తన ముందున్న మాధ్వుల ఆడవాళ్ల గోచీపెట్టి కట్టుకున్న చీరలు సువ్యక్తం చేస్తున్న పిక్కల నునుపుదనం..... ఆ శరీరాల్లో వంపులు .... శ్రీధర్ మనస్సు పాదరసంలా జారి పరువెత్తుతోంది, చూపు భ్రమరంలా తీరని ఆకాంక్షతో పరిభ్రమిస్తోంది .... ఏమిటీ చిత్తవికారం దేవాలయంలో ! .... ఇంతలో ఆడవాళ్లు పూజ ముగించుకొని ఒక గుంపుగా వెనక్కి మళ్లారు. దారి ఏర్పడింది. శ్రీధర్ గర్భాలయం దగ్గరకు చేరుకున్నాడు.

ప్రేమకూ, సత్యానికీ తనకు దారి చూపించమని దైవాన్ని మనసులో ప్రార్థించాడు. మళ్లీ పూజ జరిగింది. గంట గణగణ మ్రోగింది. పువ్వులూ, తీర్థం తెచ్చాడు పూజారి. అతను శ్రీధర్‌కు బాగా పరిచితుడే. పలకరించాడు. అందరికీ తీర్థం పంచిన తర్వాత లోపలికి వెళ్లి ఒక కొబ్బరిచిప్ప తెచ్చి శ్రీధర్ కిచ్చాడు.

శ్రీధర్ ఆలయంలో రాతి అరుగుమీద కొన్ని క్షణాలు కూర్చున్నాడు. అతనికి శేషాద్రిగారి మాటలు మళ్లీ జ్ఞాపకం వచ్చాయి. ఇంటికి తిరిగివస్తూ ఆలోచిస్తున్నాడు.... తనెవ్వరినీ ద్వేషించటంలేదే, అసహ్యించుకోవటంలేదే ! మంగమ్మత్తమీద కూడా అసహ్యంలేదు, నిర్లక్ష్యం తప్ప .... ఆవిడకు తనమీద ఎంతో మమకారం ..... ఆమెకు సంతృప్తి కలగజెయ్యటం తన బాధ్యతే అయినప్పుడు తను నిర్లక్ష్యం చూపడం, అది ఒక విధంగా ప్రేమ చూపకపోవడం, అందుకే కాబోలు యీ సత్యం అసత్యం సమస్య. .... ఇకనుంచీ ఆమెకు సంతానంలేని లోటు తన చేతనైనంతవరకు తీర్చటం తన కర్తవ్యం కాదా ! దానివల్ల ఎవరికీ నష్టంలేదు.... ఈ విషయం తన కిన్నాళ్లుగా ఎందుకు తట్టలేదో !

ఇంట్లో అడుగు పెట్టగానే శ్యామల కనిపించి, చేతిలోని కొబ్బరిని లాక్కున్నది. "నాక్కొంచెం కావాలి, అది దేవుడి ప్రసాదం, అంతా నువ్వే తింటానికి కాదు !" అన్నాడు శ్రీధర్.

"గుడికి వెళ్లావా ? ఏ గుడికి ?"

"ఆంజనేయస్వామి."

శ్యామల "అమ్మా, అమ్మా" అంటూ లోపలికి పరుగెత్తింది. తర్వాత వంటింట్లోంచీ కత్తి పట్టుకొచ్చి కొబ్బరి తియ్యటం ప్రారంభించింది.

"బందరునుంచి పిన్ని తొందరగా రాలేదే అని దేవుడికి టెంకాయ కొట్టావేమిటి ?" అన్నది శ్యామల.

శ్రీధర్ ఏమీ మాట్లాడలేదు. దీపంవైపు చూస్తూ కూర్చున్నాడు. కొబ్బరిముక్క తీసుకెళ్లి అతని కివ్వబోయింది శ్యామల ....

"నాకు వద్దుపో."

"అలిగావేమిటి అంతలోనే ?"

బలవంతంగా కొబ్బరిముక్క అతని పెదవుల మధ్య దోప డానికి ప్రయత్నించింది శ్యామల. పెదవులమీద కలిగిన స్పర్శతో నవ్వు వచ్చి నవ్వుతూ నోరు విప్పేశాడు శ్రీధర్. శ్యామల కూడా కిలకిలా నవ్వింది .....

సన్నజాజుల వాసన గుప్పున కొట్టింది.

లోపలినుంచీ రుక్మిణమ్మ శ్యామలను కేక వెయ్యటంతో శ్యామల పరుగుతీసింది.

సన్నజాజుల వాసనతో కోవెలలో యిందాక తనలో త్రాచుపాములా పడగవిప్పిన కోరిక మళ్లీ నృత్యం ఆరంభించింది. మాధ్వ వనితల లావణ్యం మనస్సున గ్రుచ్చుకొన్న ముల్లులా బాధించింది ....

"అమ్మ మనిద్దర్నీ అన్నానికి రమ్మంటోంది; లే" అన్నది శ్యామల తిరిగి వచ్చి.

శ్రీధర్ యాంత్రికంగా లేచాడు.

భోంచేస్తూ ఉండగా రుక్మిణమ్మ అన్నది : "నువ్వు బందరు తొందరగానే వెళ్లివస్తే బావుంటుంది .... నెలాఖరు యింకెన్నినాళ్లో లేదు !"

శ్రీధర్‌కు మంగమ్మత్త కూడా తొందరపెట్టటం గుర్తువచ్చింది. ఒకవైపు ఆమె, ఇంకొకవైపు ఈమె, ఇద్దరూ ఒక్క విషయమే నొక్కి చెబుతున్నారు, తన శ్రేయస్సు కోరి. వీళ్ల మాట వినటం కంటె కర్తవ్యం ఏముంది !

"నావెంట ఎవరైనా వస్తే బావుంటుందేమో ! నువ్వు రావా వదినా ?"

"నాకు తీరుతుందా ప్రయాణాలకు ? అయినా దీనికి యింకొక రెందుకు ?"

"నేను వస్తాను చిన్నాన్నా, నన్ను తీసుకెళ్లు" అన్నది శ్యామల.

"ఇంకేం ? అందరికీ ముందు ఈ పెద్ద ఉంది, దీన్ని తీసుకెళ్లు" అన్నది రుక్మిణమ్మ నవ్వుతూ.

"ఫోమ్మా, నువ్వు నన్నెక్కడికీ వెళ్లనీవు !" మూతి విరిచింది శ్యామల.

"మంగమ్మత్త వస్తానంటూ ప్రయాణమై ఒత్తిడి చేస్తోంది వదినా !" అన్నాడు శ్రీధర్.

రుక్మిణమ్మ వూరుకున్నది. వెంటనే ఏమీ జవాబు చెప్పలేదు. తర్వాత నిర్లిప్తతను ధ్వనిస్తున్న కంఠంతో "అంతగా యిష్టపడుతూ ఉంటే తీసుకెళ్లు, దానికేం ?" అన్నదామె.

"అయితే రేపు వెళ్లి ఆమెతో మాట్లాడి రానా ?" అన్నాడు శ్రీధర్.

బుధవారం రామలింగయ్య శ్రీధర్‌ని పిలిచి చెప్పాడు :

"బందరు వెళ్లటానికి నిశ్చయించుకున్నావట ! మంచిదే! ఇవ్వాళే వెంకయ్యగారి దగ్గరి నుంచి ఉత్తరం కూడా వచ్చింది.... అమ్మాయిని తీసుకురావటానికి తనకు తీరికలేదట .... ఉద్యోగం కూడా చెయ్యడం లేదుకదా అబ్బాయిని పంపితే అనుకూలంగా ఉంటుందని వ్రాశాడు. ఇప్పుడు నువ్వు వాళ్ల జాబు చూచుకొని వెళ్లినట్టుంటుంది, అదీ మంచిదే ! ..... ఇదేమిటి మీ అత్త మంగమ్మ కూడా ప్రయాణం కట్టిందని విన్నాను ?"

వెంకయ్యగారి లేఖ శ్రీధర్ కందించా డాయన.

శ్రీధర్‌కు ఈ లేఖ రాకుండా తనే స్వయం నిర్ణయం మీద వెళ్లినట్లు ఉంటే బావుండే దనిపించింది ! ..... ఉద్యోగం చెయ్యటంలేదు కాబట్టి అబ్బాయిని పంపితే అనుకూలంగా ఉంటుందని వ్రాయటంలో అంతరార్థ మేమిటో ! తను వెళ్లి అక్కడ యిల్లరికం కూచోవాలని అభిప్రాయమా ? అది ఈ జన్మలో జరగనిపని ! .....

"మంగమ్మను వెంటబెట్టుకొని పోవటం నీ కిష్టమేనా?' మళ్లీ ప్రశ్నించాడు తండ్రి.

"ఆఁ .... రానివ్వు నాన్నా, ఫరవాలేదు...."

అత్తయ్య వాగ్ధాటి అక్కడ తనకు కొంత సహాయకారిగా కూడా ఉంటుందనిపించింది శ్రీధర్‌కు.

"నీ స్నేహితుడు ఆ డబ్బు పంపించాడా ?"

"ఆఁ. ఇవ్వాళే వచ్చింది."

"సరే, నీ ఖర్చులికి అట్టే పెట్టుకో .... మంగమ్మ తన ఛార్జీలు తను పెట్టుకోదూ ?"

"అలాగే."

శ్రీధర్ ప్రయాణమైన రోజున మంగమ్మే కాకుండా, ఆమె భర్త ఓబయ్య కూడా బయల్దేరాడు. భార్యాభర్తలిద్దరూ బెజవాడ, బందరు చూడాలంటూ సిద్ధమయ్యారు. శ్రీధర్ కాదనలేకపోయాడు.

## 7

బందరులో మంగమ్మ ఓబయ్యలు మాట్లాడినతీరు, ప్రవర్తించిన విధానం శ్రీధర్ కేమీ నచ్చలేదు. తార తల్లిని మంచి చేసుకోవటానికి మంగమ్మ పడిన తాపత్రయం, ఓబయ్య వెంకయ్యగారిని చేసిన ముఖస్తుతీ శ్రీధర్‌కు వెగటు కలిగించాయి. బుద్ధి గడ్డితిని వీళ్ల నెందుకు వెంటబెట్టుకుని వచ్చానా ? అని విచారించాడు.

ఓబయ్యతో వెంకయ్యగారు శ్రీధర్ భవిష్యత్తుని గూర్చి చూచాయగా ఏదో ప్రస్తావించారట. ఒకనాడు శ్రీధర్‌తో ఏకాంతంగా, బజారుకు వెళ్లినప్పుడు, ఆ సంగతి చెప్పాడు ఓబయ్య. "నువ్విక్కడ వ్యవసాయం చూడటమేమిట్రా, గౌరవం, మర్యాదా లేకుండా ? బోడి వ్యవసాయం మనకు లేదా ? అయినా గొప్పగా చదువుకున్నవాడివి, నీ చదువేంగాను ! .... ఈ విషయం వీళ్ళు మళ్లీ ఎత్తకుండా నేను సమాధానం చెబుతాను చూడు !" అన్నాడు. ఇన్నాళ్లూ తను వ్యాఖ్యానించుకొంటున్నదంతా నిజమేననీ, అత్తవారు తనని యిల్లరికం ఉంచుకోవటానికే ఉద్దేశిస్తున్నట్లు యిప్పుడు మళ్లీ రుజువైందనీ అనుకున్నాడు శ్రీధర్.

ఆరోజు రాత్రి భోజనాల తర్వాత శ్రీధర్ ఎదురుగా కూర్చుని ఉండగానే ఓబయ్య వెంకయ్యగారితో యిడాలాపంగా వ్యవసాయం సంగతి ప్రస్తావించి, తనకు మొత్తం ఇరవై ఎకరాల మాగాణి ఉందనీ, పిల్లలు లేరనీ, శ్రీధర్‌నే దత్తత తీసుకోవాలని ఉద్దేశమనీ స్పష్టంగా చెప్పాడు. ఓబయ్యకున్న మొత్తం పొలం పదెకరాలు మాత్రమే, అంతా మాగాణి కూడా కాదు ! శ్రీధర్‌కు ఓబయ్య అలా అబద్ధం చెప్పి గొప్పలు పోవడం బాధ కలిగించింది. ఓబయ్య అంతటితో వూరుకోకుండా శ్రీధర్ తండ్రినీ వాళ్ల ఆస్తినీ కించపరుస్తున్న ధోరణిలో మాట్లాడుతూ "వీళ్ల అన్నదమ్ములు పంచుకుంటే మాగాణి ఏ నాలు గెకరాలు మాత్రమో వస్తుంది మన అబ్బాయికి; కాని, ఆ పొలం నా పొలం దగ్గరే ఉండటంతో మనదే పెద్ద వ్యవసాయం అక్కడ !" అన్నాడు. శ్రీధర్‌కు కోపం ముంచుకొని వచ్చింది. కాని ఏమీ అనలేక అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు.

మంగమ్మ వెంకయ్య భార్యను 'అక్కా' అని ఆప్యాయంగా వినయంగా సంబోధిస్తూ, తారను 'అమ్మా !' 'తల్లీ' అని అడుగులకు మడుగులొత్తుతూ, పాపాయికి అన్ని సేవలు చేస్తూ, ముద్దూ మురిపెం కురిపిస్తోంది. తారకు ఏ లోటూ రాకుండా తను చూచుకొంటాననీ, తీరా బయల్దేరే ముందు హామీ యిస్తూండటం కూడా శ్రీధర్ స్వయంగా విన్నారు.

ఆలోచిస్తే మంగమ్మత్త ప్రవర్తనలో నిజంగా తప్పు పట్టవలసిందేమీ లేదేమో ! మోతాదుకు మించిన ప్రేమా, ఆప్యాయతా ఆమె చూపిస్తూండటం తనకు ఎబ్బెట్టుగా కనిపించినా, అది ఆమెలో ఎన్నాళ్లగానో అణగద్రొక్కబడిన మాతృత్వం యొక్క సహజమైన విజృంభణ మాత్రమే కాదా! అందులో అసత్యం, కాపట్యం, కాలుష్యం ఏమాత్రం లేవే ! చదువుకున్నవాళ్లకూ నాగరకతకు దాసులైపోయిన నాజూకు వాళ్లకూ ప్రేమానురాగాల జృంభణం, దాన్ని అదుపులో పెట్టుకోకపోవటం ఎబ్బెట్టుగానే ఉండవచ్చు. కాని పాలపొంగులాంటి హృదయ నైర్మల్యం, బంధుప్రేమ అలా వ్యక్తం అవుతోందనీ, అందులో స్వభావ సౌందర్యం ఎంతో ఉందనీ సమాధాన పడ్డాడు శ్రీధర్.

మదనపల్లి చేరువ పడుతూండగా దంపతుల్ని సరాసరి తన యింటికి వచ్చి రెండు రోజులు ఉండి వెళ్లవలసిందంటూ మంగమ్మ బలవంతం చేసింది.

"అలా వీలుకాదత్తా ! తర్వాత తప్పకుండా నేనూ తారా వస్తాం, కాని ప్రస్తుతం మాత్రం సరాసరి మా యింటికి వెళ్లాల్సిందే, లేకపోతే నాన్నగారికి కోపం వస్తుంది." అన్నాడు శ్రీధర్ కచ్చితంగా.

మంగమ్మ అసంతృప్తి కనబరుస్తూ "మీ నాన్నగారి కంటె వదినెకే ఎక్కువ భయపడతావులే నువ్వు !" అన్నది ఈసడింపుగా.

తార ఎదుటే ఆమె అలా అనడమా ! శ్రీధర్ మనస్సుకు బాధ కలిగింది. మదనపల్లి బస్టాండ్‌లో దిగిన తర్వాత మంగమ్మను పలకరించనైనా లేదు శ్రీధర్. మంగమ్మ భర్తకు తాళం చెవులూ, సామానూ అప్పగించి, "నేను వెళ్లి అమ్మాయిని దిగబెట్టి యిప్పుడే వచ్చేస్తా" నంటూ తారతో జట్కా బండి ఎక్కి కూర్చున్నది. శ్రీధర్‌కు ఆశ్చర్యం కలిగింది. ఆమె పుట్టింటిలో పాదం పెట్టి కొన్ని సంవత్సరా లవుతోంది. ఇవ్వేళ యిలా మళ్లీ మనస్సు మార్చుకొన్నది. ఇందుకు సంతోషించాలో, భయపడాలో అర్థంకాలేదు శ్రీధర్‌కు.

రుక్మిణమ్మ "ఎర్రనీళ్లు" తీసి పోసింది. పాపాయిని చేతుల్లోకి తీసుకొన్నది ఇంట్లో ప్రవేశించగానే. మంగమ్మను చూచి "తారవల్లనైనా పిన్నిగారికి మామీద దయ కలిగింది" అన్నది నవ్వుతూ.

"ఆ దయేదో నువ్వే చూపించాలి తల్లీ ! అయినా నా పుట్టింటికి నేను రావటానికి ఒకళ్ల దయాదాక్షిణ్యా మేమిటి? బోడిపెత్తనం !" అన్నది మంగమ్మ వెటకారంగా, కోపంగా.

రుక్మిణమ్మ ఏమీ సమాధానం చెప్పకుండా, తారను కుశలప్రశ్నలు వేస్తూ, పాపాయి వివరాల్ని కనుక్కుంటూ వాళ్లకి కావల్సినవి చూట్టంలో నిమగ్నురాలైంది. రుక్మిణమ్మ పనిమీద లోపలికి వెళ్లగానే మంగమ్మ తారతో "ఇక నేను వెళ్తాను తల్లీ ! నీకేం కావల్సినా నాకు కబురు చెయ్యి. రేపు తప్పకుండా యింటికి వస్తావుకదూ ! నేను బండీ పంపిస్తానులే" అన్నది. అక్కడికి వచ్చిన రామలింగయ్యగారు "ఏమి టప్పుడే వెళ్లిపోతున్నావు మంగమ్మా" అని పలకరించారు. "ఆయన ఒక్కరే వెళ్లారు ఇంటికి .... తిండీ తిప్పలూ చూడొద్దూ?" అన్నదామె. "అదేమిట్రా శ్రీధర్ ! మీ మామని కూడా యిక్కడికే రమ్మనలేదూ ? వూరినుంచీ వచ్చి యిప్పుడేం యిబ్బంది పడతారూ ? అంతమాత్రం తోచలేదేమిటి నీకు ?" కొడుకుని తప్పు పట్టారు రామలింగయ్యగారు. శ్రీధర్ జవాబు చెప్పలేదు. "వస్తాను అన్నయ్యా" అనేసి మంగమ్మ చరచరా వెళ్లిపోయింది.

బందరులో ఉన్న నాలుగు రోజులూ శ్రీధర్‌కి అవకాశమే లభించలేదు తారను ఏకాంతంగా పలకరించటానికి. మంగమ్మత్త ఎప్పుడూ తార దగ్గరే ఉండేది. ఇల్లు చిన్నది కావటంతో రాత్రిళ్లు మగవాళ్లు ఒకచోటా, ఆడవాళ్లందరూ ఒకచోటా పడుకోవలసి వచ్చేది. తార మాటల్లో కాని ధోరణిలో కాని ఎక్కడా తనమీద కోపం ఉన్నట్లు తోచకపోవటంతో శ్రీధర్‌కు సంతృప్తి కలిగింది. తారలో మార్పు వచ్చినట్లే తోచింది.

శ్రీధర్ స్నానం భోజనం ముగించగానే రుక్మిణమ్మ పాపాయిని తెచ్చి అతని వళ్లో ఉంచింది. తారా తనూ అన్నాలు తిని వచ్చేదాకా చూస్తూండమని చెప్పింది.

మొదట చూచినప్పటికీ యిప్పటికీ పాపాయిలో కలిగిన మార్పూ అతనికి కుతూహలాన్ని కలిగిస్తోంది. పాపాయి నల్లబడటమే కాదు, చిక్కిపోయి సన్నంగా కూడా ఉంది. కాని ముఖంలో కళ, కళ్లల్లో వెలుగు, నిదానంగా గమనించేవాళ్లకు ఆ పాపాయిలో ఉన్న చైతన్యసంపదని వ్యక్తం చేస్తున్నాయి. పాపాయి వేళ్లు చిన్న చిన్న వస్తువులని పట్టుకొని విడువ

నంటాయి. చూపులు ముఖాల్ని గుర్తించి ప్రశ్నించటం, నవ్వించటం నేర్చుకున్నాయి. పాపాయి కుడిచేతికి తన చూపుడు వేలు అందించాడు శ్రీధర్. వేలు గట్టిగా పట్టుకొని నోటి దగ్గరకు లాక్కుంటోంది పాప. పాప కళ్లల్లోకి చూస్తున్నాడు కుతూహలంగా ప్రశ్నార్థకంగా .... మనస్సు ఈలోకపు సరిహద్దుల్ని దాటి ఎక్కడో ఆకాశ నీలిమలోకి, అనంతకాలంలోకి, అర్థంకాని సృష్టి రహస్యంలోకి దూసుకునిపోయి, ఆవేగ లహితమైన, అనిర్వచనీయమైన ఆనందంలో నిశ్చలత్వాన్ని పొందుతోంది..... పాప ఒక వేదాంతి !

ఉన్నట్టుండి పాప నవ్వుతూ కేరింతాలు కొట్టింది. శ్రీధర్ తన్మయత్వం భగ్నమైంది. పాప ఏమీ తెలీని అమాయకత్వంతో నిస్సహాయంగా 'నీమీదే ఆధారపడ్డా' నన్నట్లుగా తన వైపు జాలిగా చూస్తూ ఉందని తోచింది. ఇదొక విచిత్రమైన అనుభవం. పాప తన వేలు పుచ్చుకుని తన్నింకో లోకంలోకి తీసుకువెళ్తున్నట్లా ? లేక యీ లోకంలో మనుగడకు సహాయం కోరి తనమీద ఆధారపడుతూ జాలిగా వేలు గట్టిగా పట్టుకున్నట్లా ? ఎవరు ఎవరిమీద ఆధారపడుతున్నారు ? ఇందులో ఏది సత్యం ?

శేషాద్రిగారు అందుకే కాబోలు ఎటూ తేలని సత్యాన్ని గూర్చి జిజ్ఞాస అపుచేసి, ప్రేమని సాధించమన్నారు !.....

తార భోజనం ముగించి గదిలోకి వచ్చింది. శ్రీధర్ దగ్గరకు వచ్చి పాపాయిని తీసుకోవటానికి చేతులు చాచింది. ఆమె చేతుల్లో తన చేతు లాన్చి పాపాయిని అందించాడు. గాజుల శబ్దం, ఆమె అద్దుకున్న పౌడరు వాసనా, హాయిగా తృప్తిగా ఉన్నాయి. తార కళ్లల్లోకి చిలిపిగా చూస్తూ "పాపాయి నీకంటె గడుసుదిలా ఉంది, అన్నీ తెలిసి ఏమీ తెలీనట్లు నటిస్తుంది." అన్నాడు.

"నటించటం మీకూ మీవాళ్లకూ బాగా చాతనైన విద్య" అన్నది తార. ఆమాట నవ్వుతూ కాదు, నేరారోపణ చేస్తున్నట్లే అన్నది.

"నువ్వూ నేర్చుకో, సరిపోతుంది" అన్నాడు నవ్వుతూ.

"నాకే మవసరం ?" అన్నది తార పాపను మంచంమీద పడుకోబెట్టి పొత్తిళ్ళు సరిచేస్తూ.

ఆమె ముఖ కవళికలు కనిపించలేదు, అటువైపు తిరిగి ఉండటం మూలాన. మళ్లీ యుద్ధం ప్రారంభమైనదనిపించింది శ్రీధర్‌కు.

"చూడు తారా, నువ్వెందుకు నన్నెప్పుడూ అపార్థం చేసుకుంటావు ? ఇప్పుడు నేనేమన్నాననీ ?"

"ఏమన్నారో మీకే తెలుసు. అనటమూ మీరే అనలేదని నటించటమూ మీరే !"

"నే నన్నది సరదాకని తెలీదా ?"

"అవును మీ కన్నీ సరదానే !....నన్నిక్కడికి తీసుకురావటం సరదాకే .... నన్ను హింసించడమే మీ సరదా !"

శ్రీధర్‌కు కోపం వచ్చింది.

"ఇక్కడికి తీసుకరాకపోతే ఏట్లోకి తీసుకుపోతానా ? రావటం యిష్టంలేకపోతే అక్కడే ఉండకపోయావా ?"

"నిక్షేపంగా ఉండేదాన్ని ! .... ఇన్నాళ్లూ పట్టించుకోకపోతే ఉండలేదా ? .... అన్నవస్త్రాలకి లోటేమీ లేదు !"

"చెట్టుక్రింద బిచ్చగాళ్లకు కూడా అన్నవస్త్రాలకి లోటుండదు. అదికాదు సంగతి .... నేను పట్టించుకోకపోతే నీకెందుకు పట్టలేదో తెలుసుకోవాలని ఉంది .... నాలుగు నెలలుగా ఉత్తరమే వ్రాయకపోతివి, కారణం రాజసమా ?"

తార గిరుక్కున శ్రీధర్ వైపు తిరిగింది.

"ఎవరూ వ్రాయంది ? పాపకు విరేచనాలని వ్రాస్తే తిరుగులేదు ! మద్రాసులో ఉన్నారో లేదో కూడా తెలీదాయె... ఇంతకంటె నటనా ?" మాటల్లో విజయం తనదే నన్నట్లు చూస్తోంది ఆమె ....

ఆమె కళ్ళూ, పెదవులూ, వ్యక్తి సర్వస్వమూ అతన్ని తీవ్రంగా ఆకర్షిస్తున్నాయి. అతనికేం చెప్పాలో తట్టనేలేదు.... ఎందుకొచ్చిన వాదం, ఏమిటీ గొడవ మధ్య ?.... హాయిగా ఉండకూడదూ ! అనిపిస్తోంది ఒకవంక.

శ్రీధర్ కూర్చున్న చోటునుంచి లేచి ఒక్క అంగలో ఆమె దగ్గరకు వెళ్లి పొదివి పట్టుకొని ముద్దు పెట్టుకోబోయాడు. ఆమె ముఖం చటుక్కున ప్రక్కకి త్రిప్పుకోవటంతో అతని పెదవుల కామె కణత తగిలింది .., "వదలండి ఎవరైనా వస్తారు !" అంటూ మెల్లగా అతని చేతుల్ని వదిలించుకొన్నది తార.

"ఇదుగో, ఇలాటిదాన్నే నటన అనేది !" అన్నది అతను వదలగానే.

"సరే, నువ్వనుకుంటున్న దేమటో సవిస్తరంగా చెప్పెయ్. తర్వాత ఏ గొడవా ఉండదు' అన్నాడు.

"ఏముంది చెప్పటానికి ? ఏమీలేదు !"

"లేకపోతే యీ కోపాలు తాపాలు ఎందుకని ?"

రుక్మిణమ్మ గదిలో ప్రవేశించింది. "ఆకులూ వక్కపొడీ తీసుకోనే లే దేమిటి ? నేనూ యిప్పటిదాకా వాటి సంగతి మరచిపోయాను." అని తాంబూలపు పళ్లెం తార చేతి కిచ్చి వెళ్లిపోయిం దామె.

ఆ పళ్లెం టేబిల్‌మీద పెట్టి తార పాప ప్రక్కన మంచంమీద కూర్చుంది. శ్రీధర్ ఆమె ఏమి చెబుతుందోనని ఎదురుచూస్తున్నాడు. తార పాపను చూస్తూ ముఖావంగా కూర్చున్నది. తాంబూలం సిద్ధంచేసే ప్రయత్నం కూడా చెయ్యలేదు.

అయిదు నిమిషాలు, పది నిమిషాలు గడిచినా నిశ్శబ్దం నిశ్శబ్దంలానే ఉంది. శ్రీధర్ మనస్సు విరక్తితో దిగజారిపోయింది. అక్కడినుంచి వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రం ఏమీ తోచక హైస్కూలు టీచరు చలమయ్య ఇంటికి వెళ్లాడు శ్రీధర్. చలమయ్య ఎనిమిది మంది కుర్రవాళ్లని కూర్చోబెట్టుకుని ట్యూషన్ చెబు

తున్నాడు. శ్రీధర్ రాగానే పిల్లల కేదో వ్రాత, చదువు పురమాయించి వరండాలోకి వచ్చి కూర్చున్నాడు.

"ఇంతమందికి ఒక్కసారిగా చెబితే వీళ్లకు చదువేం వస్తుంది చలమయ్యా ?" అన్నాడు శ్రీధర్.

"ఇదీ లేకపోతే అసలు రాదుగా వీళ్లకు ! .... సహాయమనేది ఒకళ్లిద్దకైతే ఏం లాభం చెప్పు ! ..... నువ్వట్లా అనుకుంటావుగాని నా దగ్గర చదువుకున్నవాడెవడూ చెడిపోలేదు శ్రీధర్ ! నేను మీ వీధిలో ఉండేప్పుడు నా దగ్గర చదువుకున్నవాళ్లందరూ ఇప్పుడు బియ్యేలు ప్యాసై ఉద్యోగాల్లో ఉంటున్నారు తెలుసా ! .... అన్నట్లు నీ ఉద్యోగం సంగతి ఏమైంది ? ఈమధ్య నువ్వు కనిపించనేలేదు !"

"బందరువెళ్లి యివ్వాళే వచ్చాను. ఉద్యోగానికి ఏదీ, ఏమీ మార్గం కనిపించలా యింతవరకు. చివరకి వ్యవసాయమే స్వయంగా చేయిద్దా మనుకుంటున్నాను.

"మీ అన్న చేస్తున్నాడుగా."

"మా అన్నకు నేనూ తోడుగా ఉంటాను."

"ఇద్దరెందుకోయ్ ? అదీగాక చక్కగా బి. ఎస్. సి. ప్యాసైనవాడివి. నే నొక్కమాట చెబుతా ఆలోచించు. సైన్సు గ్రాడ్యుయేట్లకు హైస్కూళ్లలోఎంత డిమాండు ఉందనీ ! నువ్వు టీచరుగా ఎందుకు ప్రవేశించగూడదు ? సెకండరీ గ్రేడు ప్యాసై ఎటూ మార్గంలేక పోయిన నేనే క్రమంగా ప్రయివేటుగా బి. ఏ. ప్యాసై బి. యిడి. కూడా అయి అయి ఎలా సాధించానో, జయించుకు వచ్చానో నీకు తెలీనిది ఏముంది ! నాతో పోల్చి చూస్తే నువ్వెంతో అదృష్టవంతుడివి. ఒక్క ఎనిమిది నెలలు బి. ఇడి. లేక బి. టి. పూర్తిచేసుకుని వస్తే యిక్కడే నీకు ఉద్యోగమూ దొరుకుతుంది, అప్పుడు అవసరముంటే సేద్యమూ ఒకవైపు చూసుకోవచ్చు. తర్వాత పట్టుదలే ఉంటే ఎం. ఏ. కూడా కావచ్చు. లేదా ట్యూషన్ చెబితే నెలకు ఎంత లేదన్నా నలభై, యాభై అదనంగా దక్కుతుందీ ...."

"నువ్వు ఎనిమిది మందికి చెబుతున్నావు, యాభైయేనా సంపాదిస్తున్నావు ?"

"నా సంగతి వదిలెయ్ ! ట్యూషన్ యింతమందికీ ఏకధాటిగా చెప్పటానిక్కూడా అనుభవం కావాలి. టెక్నిక్ తెలియాలి .... దానికేం గాని, ఏమంటావ్, నా అయిడియా ఎలా ఉంది ?"

"టీచరవుదామని నే నెప్పుడూ అనుకోలేదే ?"

"ఇప్పు డనుకో .... దాని దేముంది !"

చలమయ్య శ్రీధర్‌ని ప్రోత్సహిస్తూ మాట్లాడుతూ ఉండగా ఒక కుర్రవాడు తొమ్మిదేళ్లవాడు వచ్చి చలమయ్యకు కొంత దూరంలో నిల్చున్నాడు.

"ఏమోయ్ సత్యం, డబ్బు తెచ్చావా ?"

"లేదుసార్, మా అమ్మ వచ్చే నెలలో తప్పకుండా యిస్తామని చెప్పమన్నది సార్."

"అలా వీల్లేదోయ్ .... పోనీ ఈ నెలలో రావద్దు, వచ్చే నెల నుండి వద్దువుగాని, వెళ్లు."

ఆ కుర్రవాడు, సత్యం, చలమయ్యని ప్రాధేయపడ్డాడు ఎంతో దీనంగా. చక్కని ముఖం, కళ్లల్లో ఏదో ఆకర్షణా, అన్నిటికంటే ఆ అబ్బాయి పట్టుదల శ్రీధర్‌కి ముచ్చట గొలిపాయి. చలమయ్య ఆ కుర్రవాడిని చేర్చుకో నన్నాడు. వాడు వెళ్లిపోయాడు.

"ఎవరి అబ్బాయి ?"

"రాఘవరావు మిడిల్‌స్కూల్లో టీచరు ఒకావిడ ఉంటే ఆవిడ తాలూకు. ఆ రాఘవరావు సొంత స్కూలు కాబట్టి ఆవిడమీద మోజుతో ఉద్యోగం యిచ్చాడు ట్రెయినింగ్ ప్యాస్ కాకపోయినా. రెండు నెలల క్రితం అతను పోయాడు. ఉన్నంతకాలం ట్యూషన్ డబ్బు తనే యిచ్చేవాడు. ఇహ ఇప్పుడెవరు యిస్తారు ? ఈ నెలలో స్కూలు తెరిచారు కదూ, ఈవిడ ఉద్యోగం కాస్త వూడినట్లుంది...... ఈ పరిస్థితుల్లో ట్యూషన్ ఎందుకు చెప్పు, అనవసరంగా, తాహతు లేనప్పుడు ?"

"కుర్రవాడు తెలివైనవాడులా ఉన్నాడు. ఆమె కూడా టీచరే కదా, ఏదో సహాయం చేయగూడదూ, పోనీ."

"డబ్బు తీసుకోకుండా చెప్పే వోపిక లేదు స్వామీ నాకు! అసలు పంతుళ్లకు జీతాలే తక్కువ. వాళ్ల వృత్తే లోకసేవ. ఇక దాంట్లో మళ్లీ మొదలుపెడ్డ బేరం చెయ్యాలంటే బ్రతికేదెలా చెప్పు. ఆమె సంగతి నీకు తెలీదులే. ఆమె కెంత టెక్కు! ఆమెకు మనలాంటివాళ్ల దయా దాక్షిణ్యాలతో పనేమిటి ?..... ఆవిడ కేమోయ్, రేపు యీపాటికల్లా ఇంకో బంగారు పిచ్చుకనెవరినో వలలో వేసుకుంటుంది. తర్వాత కొడుక్కు ట్యూషనూ చెప్పిస్తుంది; ఉద్యోగమూ యిప్పిస్తుంది !"

"అదేమిటి, ఆమెకు భర్త లేడా ? నడత మంచిది కాదేమిటి ?"

"ఏం భర్తో ! పోయాడట ఎక్కడో రైల్వేలో ఉద్యోగము చేసి. తర్వాత ఈ వూరు చేరింది రాఘవరావు ప్రాపకంతో. ఇప్పుడు రాఘవరావు పోయాడు, బహుశా ఇంకో వూరు చేరుతుంది, ఇంతలో యింకెవ్వరూ దొరక్కపోతే !"

"అందంగా ఉంటుందా ?"

"ఏమిటీ అందం అంటే ? తాను వలచింది రంభ !"

చలమయ్య ట్యూషన్ కుర్రవాళ్లు ఒక్కొక్కరే వాళ్లు వ్రాసింది తెచ్చి చూపిస్తున్నారు. శ్రీధర్ 'వెళ్తా' నంటూ లేచాడు.

"కూర్చో శ్రీధర్ కాఫీ తీసుకు వెళ్లుదు గాని."

చలమయ్య బలవంతంచేసి కూర్చోబెట్టాడు. కాఫీ యిచ్చి మళ్లీ బి. టి. లో చేరమని ప్రోత్సహించాడు. తర్వాత యిద్దరూ సినిమాకి వెళ్లారు.

సినిమానుంచి తిరిగి వస్తుంటే శ్రీధర్ మనస్సు స్త్రీవాంఛతో పిచ్చెక్కిపోయినట్లుగా ఉంది. తారను గూర్చి ఆలోచిస్తే నిస్పృహా, నిరాశా కలుగుతోంది. అంతగా

వైముఖ్యం పెంపొందించుకొన్న వ్యక్తిని పొందటానికి ప్రయత్నించటం తన ఆత్మగౌరవానికి తిలోదకా లివ్వటమే! ఆమెను లొంగదీసుకోవాలి, ఆమె తనకోసం తపించేటట్లు చేయాలి అంటే తను ఆమెకోసం తహతహ పడకూడదు! కాని, అదెట్లా సాధ్యం? యవ్వనం చెడ్డది, చిత్తవృత్తి చెప్పినట్లు వినదు! జీవితం అందరికీ సామాన్యంగా అందించే సౌఖ్యానుభూతిని కూడా తన అదృష్టం తనకు నిరాకరిస్తోంది.

ఎటు చూచినా ఎన్నో ద్వారాలు; కాని, తన్ను తనే బంధించుకున్నాడు; తను వెళ్లాలని ఆశిస్తున్న మార్గం మాత్రం తనకు సుగమం కావటంలేదు.....

"శ్రీధర్, నువ్వు రేపే మద్రాసు ట్రెయినింగ్ కాలేజీకి వ్రాయి అప్లికేషన్ ఫారమ్ కోసం. నామాట విని ఈ ఏడాదే బి. టి. ముగించుకుంటే అన్నివిధాలా మంచిది" అన్నాడు చలమయ్య.

"అదే ఆలోచిస్తూ ఉన్నాను."

"రేపు ఫారమ్ కోసం వ్రాయి, తర్వాత ఆలోచించుకోవటానికి ఎలాగూ టైం ఉంటుంది.....వస్తా" చలమయ్య శలవు తీసుకున్నాడు మధ్య దారిలోనే.

శ్రీధర్ యింటికి తిరిగి వచ్చేటప్పటికి వదినె రుక్మిణమ్మ కాచుకొని ఉంది. అన్నం వడ్డించటానికి వంటింట్లోకి వెళ్లింది శ్రీధర్‌ను చూడగానే.

శ్రీధర్ కాళ్లూ చేతులూ కడుక్కొని వెళ్లి భోజనం ముందు కూర్చున్నాడు. హరికెన్‌లాంతరు వెలుగులో వంగి వడ్డిస్తున్న వదినె ముఖంలో కన్నీటి చారికలు కనిపించాయి.

"ఏమిటి వదినా, నువ్వేదో మనసులో కష్టపడుతున్నావ్?"

"ఏంలేదు. నువ్వు తొందరగా రాలేదనీ, ఏమీ పట్టించుకోవటంలేదనీ మీ అన్నయ్య కాస్త విసుక్కున్నారు. అంతే..... మరేమీ కాదు, ఈమధ్య డబ్బు యిబ్బందీ, చిక్కులూ, వీటివల్ల ఆయన చిరాగ్గా ఉంటున్నారు..... నువ్వయినా యివాళ వూరినుంచి వచ్చి యివ్వాళే సినిమాకి వెళ్లకపోతే నేం? తార భోంచెయ్యకుండానే పడుకుంది ఆకలి లేదంటూ .... పాపాయికి పాలడబ్బా అయిపోయిందట, క్రొత్తది తెప్పించటానికా వీల్లేకపోయింది .... ఆవుపాలూ వేడినీళ్లూ కలిపి పట్టాను పాపాయికి.. .... ఆ డబ్బా పాలతో పిల్ల ఎలా చిక్కిపోయిందో చూడు ...."

శ్రీధర్‌కేం సమాధానం చెప్పాలో తెలీలేదు. ఇందులో ఎవరిది తప్పూ, ఎవరిది బాధ్యతా అయినా పూర్తి భారం మాత్రం వదినె ఒక్కర్తే మోస్తున్నట్లు అర్థం అవుతోంది... తను బి. టి. చదువుకు వెళ్లే సంగతి మొదట వదినెతో ప్రస్తావించాలి అనుకుంటూ వచ్చాడు కాని, ఆమె మాటలు వినగానే ధైర్యం కాని ఉత్సాహం కాని లేకపోయింది అతనికి.

శ్రీధర్ భోజనంచేసి తన గదిలోకి వెళ్లాడు. పాపాయీ తారా ఒక మంచంమీద నిద్రపోతున్నారు.

కోడిగ్రుడ్డు లాంతరు వెలుగులో పాపాయి ముఖం లీలగా కలిపిస్తోంది. వంగి చూశాడు శ్రీధర్. "వూ" అన్నది పాపాయి నిద్రలోనే, "నన్ను సుఖంగా నిద్రపోనీక నీ గొడవేమిటీ" అంటున్నట్లు.

శ్రీధర్ తన మంచంమీద పడుకున్నాడు. నిద్ర రాలేదు. సాయంత్రం చలమయ్య దగ్గరికి వచ్చి ప్రాధేయపడిన ఆ కుర్రవాడి సంగతేమిటి? అతని తల్లి ఎలాంటి వ్యక్తి? వాళ్లకు సాహాయ్యం చేసేవాళ్లెవరూ లేదా? ఆ కుటుంబానికి తను సాహాయ్యం చేస్తే? .....ఆమెతో స్నేహం చేస్తే? ....

ఆ కుర్రవాడికి తను ట్యూషన్ చెప్పటానికి వెడితే?

ఆమె చెడిపోయింది. ఆమె నడత మంచిదికాదంటున్నాడు చలమయ్య. పరిస్థితులు బలీయమైనప్పుడు, నిస్సహాయురాలైన వ్యక్తి ఏం చేయగలడు? అలాంటివాళ్లకు సానుభూతితో సాయం చేయాలిగాని!

"ఇదొక ఆత్మవంచన కాదా? నీకా పతితతో స్నేహం సంబంధం ఏమిటీ లేకపోతే?" అని ఒక వూహ, హెచ్చరిక ...

"కాదు, కాదు, అలా అంటే ఏ మంచి పనీ జరగదు. నేను చెయ్యదలచుకున్నది చేసితీరాలి! రేపు చలమయ్యను అడుగుతాను ఆమె ఎవరో ఏమిటో .....

చాలసేపటికి శ్రీధర్ నిద్రపోయాడు.

## 8

పొదలు ఎటుచూచినా .... అడవిలో మార్గం తెలీటంలేదు .... ఎక్కడిదో ఒక త్రాచుపాము తనవైపు వస్తూండటం చూచి పరుగెత్తాడు.... కాని అది వెనకాలే తరుముతూంది.... గత్యంతరంలేక నిలబడి దానివైపు తిరిగాడు మొండిధైర్యంతో .... సర్పం పడగవిప్పి నిటారుగా తన ఎత్తువ లేచింది ..... లేచింది లేచినట్లే ఒక పూలమొక్కగా మారింది... దాని తలమీద ఒకే ఒక పువ్వు .... ధగధగ మెరుస్తూ. అది నిజానికి పువ్వుకాదు.... చూడగా ఒక మణి అని తెలిసింది .... ఎంతగానో వేధించిన భయమంతా ఒక్కసారి సంతృప్తిగా సంతోషంగా మారింది.

నిద్రలేవగానే ఈ కల స్పష్టంగా జ్ఞాపకం వచ్చింది శ్రీధర్‌కు. కాని కల రాత్రి ఎప్పుడు వచ్చిందో, ఎప్పుడు అంతమైందో గుర్తులేదు. చాలసేపు, బహుశా నిద్రపోయినంతసేపూ అడవిలో తిరుగాడుతున్నట్లే, భయంతో పరుగెత్తుతున్నట్లే ఉంది.

తారా, పాపాయీ అవతలి మంచంమీద లేరు.

కలలో పాము తరమటం మంచిదికాదంటారు. పాము తరిమినా చివరకు కరిస్తే శుభసూచకం అంటారు. కాని తనవి పాము కరవలేదు. తను ధైర్యంగా నిలబడడంతో అది పూలమొక్కగా మారిపోయింది.

అప్పుడే ఎనిమిది గంటలు కావస్తోంది!

పెరట్లోకి వెళ్లి మొహం కడుక్కుంటూ ఉండగా వదినె వచ్చి "మీ అత్త జట్కాబండీ పంపింది..... తార 'వెడతా నంటోంది. శుక్రవారం యివాళ తలంటుకుని ప్రయాణపు బడలిక తీర్చుకుని రేపు వెడితే బావుంటుందంటే, లేదు

ఆవిడేమనుకుంటుందో, వెళ్తానంటోంది. నిన్నడగమన్నాను....'' అన్నది.

''పోనీలే వెళ్ళిరానీ వదినా! ఇద్దరి మనస్తత్వాలూ అంతే. అక్కడ ఆవిడా మొండి మనిషే. తార తనెంత అనుకుంటే అంత, వెళ్ళనీ!''

రుక్మిణమ్మ మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

శ్రీధర్ మొహం కడుక్కుని హాల్లోకి వెళ్ళేప్పటికి శ్యామల బిక్కమొహం వేసుకొని ఎదురువచ్చింది.

''ఏరీ వీళ్ళు ?''

''బండెక్కి వెళ్ళిపోయారుగా.''

''నువ్వూ వెళ్ళకపోయావా ?''

శ్యామల కొంతసేపు ఏం మాట్లాడకుండా తన పుస్తకాల దగ్గర ఏమిటో వెతుకుతూ ఉండి, చివరకు ''నాకు స్కూలు ఉందిగా'' అన్నది.

''ఉంటే యేం ? సెలవు పెడితే పోయేది ... మనిద్దరం మధ్యాహ్నం వెడతాంలే.''

''నేను రాను .... నాకేంపని అక్కడికి ?'' అనేసి వంట యింటివైపు పరిగెత్తిపోయింది శ్యామల.

తార శ్యామలని పిలవనన్నా పిలవలేదని గ్రహించాడు శ్రీధర్. తార యింత విరసంగా ప్రవర్తించటం యేమిటో అతనికి వినుగనిపించింది.

కాఫీ త్రాగిన తరువాత మళ్ళీ వెళ్ళి మంచంమీద పడుకున్నాడు. రాత్రి నిద్ర తక్కువ కావటంతో బడలికగా ఉంది.

వ్యవసాయం అంటే మాటలా ! ప్రొద్దెక్కి ఎనిమిది గంటలకు నిద్రలేవటం, సినిమాలకు వెళ్ళటం, ఎప్పుడూ ఎండ కన్నెరగకుండా స్కూలు, కాలేజీల్లో జీవితం గడపటం అలవాటయ్యాక వ్యవసాయం చెయ్యడం కష్టమే ! పూర్తిగా అజమాయిషి చెయ్యటమైనా సులువుకాదు. చలమయ్య సలహా ప్రకారం బి. టి. అయి హైస్కూల్లో చేరి, ఒక తరహాగా వ్యవహారాలు చూచుకోవటం మంచిది. అన్నయ్య ఎలాగూ ఉండనే ఉన్నాడు అన్నీ నిర్వహిస్తూ ...

ట్రెయినింగ్ కాలేజీలో చేరే విషయం తండ్రితో వెంటనే ప్రస్తావిస్తే మంచిదనిపించింది. లేచి ఆయన గదిలోకి వెళ్ళాడు.

''మంచిదే .... మీ అన్నయ్యతో ఒకమాట చెప్పి తర్వాత ఏర్పాట్లు చేసుకో .... వద్దులే, ఉండు, నేనే చెబుతాలే మీ అన్నతో..... నువ్వు ఆ దరఖాస్తు పంపించు'' అన్నాడు రామలింగయ్య.

జీవితంలో మళ్ళీ ఒక మార్గం ఏర్పడినట్లుగా అన్పించింది శ్రీధర్‌కు. కేవలం వ్యవసాయమే అని నిర్ణయించుకుని ఉంటే అదీ అత్తవారి అభిప్రాయంలో లోకువ కావటమే అయ్యేది. ఇప్పుడిదే బాగుంది అనిపించింది శ్రీధర్‌కు.

మధ్యాహ్నము భోజనానికి రావలసిందంటూ మంగమ్మ కబురుపెట్టింది రుక్మిణమ్మతో చెప్పి బయల్దేరాడు శ్రీధర్...

''అదేమిటి సిరీ ! నిన్న మధ్యాహ్నం నుంచి అమ్మాయితో మాట్లాడనే లేదట ! అక్కడున్నన్ని రోజులూ మీరు చిలకా గోరింకల్లా ఉండటం కళ్ళారా చూశాను. యిక్కడ ఇంట్లో అడుగుపెట్టారో లేదో మీ వదినె మహాతల్లి ఏం మందు చల్లిందీ, అప్పుడే అమ్మాయీ నువ్వూ పోట్లాడుకోటానికీ ? .... పాపం, కళ్ళనీళ్ళు పెట్టుకుని ఒకటే యిదైపోతోంది తార ! ఇక్క డెవరున్నారు చెప్పుకోవటానికైనా ? నేను రమ్మని కబురుపెట్టాను కాబట్టి సరిపోయింది... కానీ..''

''నీకు తెలీదులే అత్తా తార సంగతి ! ఆవిడ నెవరూ ఏమీ అనలా ! .... నేను మాట్లాడిస్తే మాట్లాడక అనవసరంగా మూతి విరిచేటప్పటికి విసుగొచ్చి రాత్రి సినిమాకి వెళ్ళొచ్చాను. దానికీ యింత రాద్ధాంతమూ ....''

''చిన్నపిల్ల దానికి తెలీకపోతే నువ్వు కాస్త వోపిక పట్టాలి సిరీ ! రాత్రి పాలు కలపటానికి డబ్బా అయిపోయిందట. తెప్పించమంటే ఆవిడగారు మాయదారి కబుర్లు చెప్పి ఆవుపాలో, బర్రెపాలో కలిపి పోసిందట .... పిల్లకు అజీర్తి విరేచనాలు ప్రారంభమయినయ్ .... ఏం, పాలడబ్బా తెప్పించటానికి అంత దరిద్ర మేమొచ్చింది ? అయినా ఎవరి సొత్తెవరు తింటున్నారని ? వూరుగాని వూళ్ళో నువ్వు పలక్కుండా సినిమాలూ, షికార్లూ తిరిగితే ఒక్కర్తీ ఏం చేసేను ? .... ఇదేం బాగులేదబ్బాయ్ !''

శ్రీధర్‌కి తారమీద కోపం వచ్చింది. కాని ఆ కోపం ఎలా వ్యక్తం చెయ్యాలో తెలీలేదు. మంగమ్మత్త వదినెగారిని మాటలు అంటోంది అంటే అందులో క్రొత్త ఏమీ లేదు. కాని అందుకు తార మూలకారణం కావటమే, వచ్చీ రాగానే యిలా జరగటమే, అతనికి వ్యధ కలిగించింది.

ఓబయ్య పొరుగూరు వెళ్ళిఉండడంతో శ్రీధర్ ఒక్కడే కూర్చున్నాడు భోజనానికి. మంగమ్మ తారను లాక్కొచ్చి అతని ప్రక్కను కూర్చోబెట్టింది, తాను వడ్డిస్తానంటూ.

భోంచేస్తూ ఆలోచిస్తున్నాడు శ్రీధర్. కోపంతో చిందులుత్రొక్కి లాభంలేదు. పరిస్థితిని బాగా అర్థంచేసుకుని ప్రవర్తించాలి, అని మనస్సుకు నచ్చజెప్పుకున్నాడు.

భోజనం తర్వాత మంగమ్మ పాపాయిని ఎత్తుకొని వచ్చి శ్రీధర్ చేతుల్లో పెట్టింది. ఆమె వెనకాలే అడుగులో అడుగు వేసుకుంటూ తార కూడా వచ్చింది.

తాంబూలపు పళ్ళెం తెచ్చిపెట్టి మంగమ్మ కూడా నిష్క్రమించింది.

తార తమలపాకులకు సున్నం రాస్తోంది.

''పాపాయికి విరేచనా లేమిటి మళ్ళీ ?'' అన్నాడు.

''ఆవుపాలు పోస్తేనూ .... ఇందాక హాస్పిటలుకి తీసుకెళ్ళాం.''

''పాలడబ్బా అయిపోయిందని ఎందుకు చెప్పలేదు నాతో?''

తార జవాబివ్వలేదు. ఇక ఆ విషయమై మళ్ళీ తగవు ప్రారంభించటమా ? అని తోచి, ఆ సంగతి అంతటితో వదిలేశాడు.

"ఎలా ఉంది ఈ వూరు ? నచ్చిందా ?"

"వూరికేం ? వూరు బాగానే ఉంది ...." అని ఆగి, అంతలోనే "మీరుండే ఆ వీధి కంటే ఈ కమ్మపల్లె బాగుంది..... ఈ యిల్లు పాతదైనా నా కిక్కడే హాయిగా ఉంది...." తమలపాకు చిలక అందించింది తార.

"నీకు ఒకళ్ల పొడ గిట్టదు ! ఒంటిపిల్లి రాకాసివి...." అంటూ ఆమె బుగ్గను వ్రేలితో తాకాడు అతను.

"అది నిజానికి మీ గుణం, నన్నెందుకంటారు ? నాకు చప్పున తెలిసిపోతుంది, నేనంటే ఎవరికి యిష్టమో ఎవరికి కాదో !"

"మా వదినెకి నువ్వంటే ప్రాణం తెలుసా ! చిన్నతనంలో మా అమ్మాయి పోయినప్పటినుంచీ ఆమె నన్ను పెంచింది..." సగర్వంగా చెప్పాడు.

"అందుకే ఆవిడ కొంగు పట్టుకొని తిరుగుతారు మీరు. ఆవిడని చూస్తే నాకు భయం ...."

"ఎందుకు భయం ?" ఆశ్చర్యం కలిగి, అడిగాడు.

"ఆమె మనసిచ్చి మాట్లాడదు .... అలాంటివాళ్లు ఎంతకైనా తగుదురు !"

"ఛ ! నిదానంమీద నీకే తెలుస్తుంది ఆమె మంచితనం."

ఆరోజు రాత్రి కూడా అక్కడే భోంచేశారు తారా శ్రీధర్‌లు. తను బి. టి. చదువదలచుకొన్న విషయం తారతో చెప్పాడు శ్రీధర్.

"అయితే చివరికి మేష్టరవటానికి నిశ్చయించుకొన్నారన్నమాట !"

"గుమస్తా ఉద్యోగం కంటె నయమే గాని, హైస్కూలు మేష్టరంటే అందరికీ అలుసే !"

"రెండేళ్లు గడిచాక ప్రయివేటుగా నాగపూర్ యూనివర్సిటీ ఎం. ఏ. పరీక్షకు కట్టవచ్చు. తర్వాత కాలేజీ లెక్చరరు కావచ్చు...."

రాత్రి అక్కడే ఉండమని మంగమ్మ బలవంతం చేసింది దంపతుల్ని.

"సిరీ ! నా ముచ్చట తీరాలి" అంటూ వాళ్లిద్దర్నీ శోభనపు వధూవరులను చేసి, సాలంకృతులుగా గదిలోకి పంపింది....

కాగి వేగిఉన్న భూమిని దయగా లాలనగా ఆకాశం అనుగ్రహించినట్లు జల్లు పడింది ఆ రాత్రి .... కాని కొండంత నిరీక్షణా పెదవి విరుపుతో ముగిసినట్లు, వేసవి తాపం తీరినా వలపు మాత్రం తీరలేదు..... ఆశ క్రొత్తగా మోసులెత్తటమే దాని ఫలితం.

ఉదయం స్నానాలు కాఫీ వగైరా కాగానే యింటికి వెళ్దామన్నాడు తారతో శ్రీధర్. తార వెళ్లి మంగమ్మతో చెప్పింది. మంగమ్మ వచ్చి "మిషన్ ఆస్పత్రి దగ్గరే ఉందాయె. ఇవ్వాళా రేపూ పాపకి మందు యిప్పిస్తే మంచిది. అమ్మాయి ఉంటుంది, నువ్వు కావలిస్తే అలా వెళ్లిరా సిరీ !" అన్నది.

శ్రీధర్ యింటికి వెళ్లాడు. వెళ్తూ తార మంగమ్మ దగ్గర అట్టే ఉండిపోవటం, వదినెకు దూరమై పోవటానికి దారి తీస్తుందేమోనని మనసులో కొంత గుంజాటన పడ్డాడు.

అతను ఇల్లు చేరుకునేప్పటికి శ్యామల స్కూలుకి వెళ్లిపోయింది, రుక్మిణమ్మ వంటయింట్లో ఉంది. సరాసరి ఆమె దగ్గరకు వెళ్లాడు.

"మీ నాన్నగారికి రాత్రి గుండెనొప్పి వచ్చింది. మీ అన్నయ్య డాక్టరు దగ్గరికి వెళ్లారు యిప్పుడే" అన్నదామె.

శ్రీధర్ ఆదుర్దాగా రామలింగయ్య గదిలోకి వెళ్లాడు. శ్రీధర్‌ని తన ప్రక్కమీద దగ్గరగా కూర్చోమని సౌంజ్ఞచేశాడాయన.

"ఎలాఉంది నాన్నా ?"

"ఫరవాలేదు, తగ్గింది...." అంటూ ఆయాసపడుతూనే నెమ్మదిగా చెప్పటం ప్రారంభించాడాయన :

"నిన్నూ వాణ్ణీ ఒకటిగానే చూశాను, వేరుగా ఎప్పుడూ చూడలేదు .... వాడూ కష్టపడుతున్నాడు.... వర్షాలు లేవు, ఏమీ చేతికందటంలేదు..... డబ్బులేదు.... ఇప్పుడు నువ్వు మద్రాసు వెళ్లాలి అంటే అప్పు చెయ్యాల్సిందే .... వాడికి అదే యిష్టంలేదు" రామలింగయ్య ఆగి కొన్ని క్షణాలు కళ్లు మూసుకున్నాడు. తర్వాత శ్రీధర్ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడాయన.

శ్రీధర్‌కు అర్థమైంది, రాత్రి అన్నయ్యా, నాన్నా తన బి. టి. చదువు విషయమై చర్చించారనీ, అన్నయ్య ఏవో నిష్ఠూరపు మాటలు అన్నాడనీ .....

"పోన్లే నాన్నా యిప్పుడు మునిగిపోయిందేమీ లేదు.... నువ్వీ సంగతి ఆలోచించనే వద్దు.... పరిస్థితులు చక్కబడనియ్యలే నాన్నా..... మొదట నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకోవాలి......"

"అలా కాదు .... ఒక ఆలోచన .... మీ మామగారికి వ్రాయి..... ఆయన మంచివాడే .... రుణంగానే తీసుకో....."'

శ్రీధర్ ముఖంలో అయిష్టత స్పష్టంగా కనిపించింది.

"నువ్వా సంగతి వదిలెయ్ నాన్నా, ఎలాగో ఒకలా అవుతుంది."

ఇంతలో నరసింహులు డాక్టర్ని వెంటబెట్టుకుని వచ్చాడు. డాక్టరు పరీక్షచేసి అన్నాడు : "ఇదివరకొకసారి వచ్చినట్లే వచ్చింది..... క్రొత్తగా ఏమీలేదు. విశ్రాంతి కావాలి అంతే."

"నేనేమీ పనిచెయ్యడటంలేదే !" అన్నాడు రామలింగయ్య.

"అలా కాదు. ముఖ్యంగా మనస్సుకు కూడా విశ్రాంతి యివ్వాలి."

డాక్టరు యింజక్షను యిచ్చి వెళ్లిపోయాడు.

"నువ్విక్కడే ఉంటావుగా .... నేను కరణం దగ్గరకు వెళ్లొస్తాను. కబురు పెట్టాడు." అని శ్రీధర్‌తో చెప్పి నరసింహులు వెళ్లిపోయాడు.

"తారా, పాపా ఏరీ ?" అని అడిగాడు రామలింగయ్య.

"అత్తావాళ్ల యింటిదగ్గ రున్నారు. పాపకి విరేచనాలు. ఆస్పత్రిలో చూపించటానికని యివ్వాళ అక్కడే ఉంటానన్నది."

"ప్రయాణం .... నీళ్లమార్పు .... వాళ్లని మంగమ్మ దగ్గర ఉంచవద్దు, యింటికి తీసుకొచ్చెయ్ సాయంత్రం ..."

శ్రీధర్ ఏమీ సమాధానం చెప్పలేదు.

అక్కడనుంచి లేచి, తండ్రి ఆహారం విషయమై కనుక్కోటానికి వంటయింట్లోకి వెళ్లాడు, రుక్మిణమ్మ అప్పుడే అంతా సిద్ధంచేసి తీసుకొని వస్తోంది. ఇద్దరూ రామలింగయ్య గదిలోకి వచ్చారు ...

ఆయన ఆహారం తీసుకుంటూ ఉండగా, "మామగారూ, నా కాసులపేరు ఉందికదా, శ్రీధర్‌ని చదువులకి వెళ్లనివ్వండి .... తర్వాత సర్దుకోవచ్చు" అన్నది రుక్మిణమ్మ.

శ్రీధర్‌కి క్రమంగా అర్థం అవుతోంది. రాత్రి జరిగిన సంప్రదింపుల్లో వదినె సుముఖంగానే ఉందని గ్రహించాడు. కాని, అన్నయ్య ప్రాతికూల్యంవల్లనే తండ్రీ వదినా ఏం చేయలేకుండా మనసు లో బాధపడుతున్నారనీ వూహించాడు.

"నరసింహులితో అన్నావా అమ్మా ఆమాట ?" అని ప్రశ్నించాడు రామలింగయ్య.

"లేదు .... ముందర మీతోనే అంటున్నా."

"చూద్దాంలే అమ్మా .... అయినా యింకోమార్గం లేకపోతే కద, వంటిమీది బంగారందాకా వెళ్లటం ...."

రుక్మిణమ్మ గ్లాసులూ వగైరా తీసుకుని లోపలికి వెళ్లిపోయింది.

"సిరీ ! నువ్వు మీ మామగారికి వ్రాయి.... శ్యామలకు పెళ్లియీడు వస్తోంది.... ఇప్పుడు వాళ్లమ్మ వంటిమీది నగలు వాడుకోవటం ఏంబాగు ? నువ్వు ఆయనకు వ్రాసిచూడు ..."

బాధ్యత సర్వమూ మోస్తున్న అన్నకు తెలీదా, ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉందో లేదో ! అతనంత ప్రాతికూల్యం వహిస్తున్నప్పుడు తను చదువు ప్రయత్నం మానుకోవటమే మంచిదనిపించింది శ్రీధర్‌కు.

మధ్యాహ్నం భోజనంవేళకు మంగమ్మ యింటికే వెళ్లాడు శ్రీధర్. ఆమె తప్పకుండా రమ్మని చెప్పింది కూడా. ఓబయ్య పొరుగూరునుంచీ తిరిగి వచ్చాడు. ఇద్దరూ కలిసే భోంచేశారు. శ్రీధర్ యదాలాపంగా తన చదువు సంగతి ప్రస్తావించాడు.

"మీ స్థితిగతులు మరీ అంత అధ్వాన్నంగా లేవు శ్రీధర్ ! నన్నడగరాదూ, నేను చెబుతాను. ఇందులో కీలకం ఒకటే. మీ అన్నకు నువ్వింకా చదువుమీద డబ్బు ఖర్చు పెట్టటం ఇష్టంలేదు, అంతే ! అతను శ్యామల పెళ్లికోసం డబ్బు జమచేస్తున్నమాట నిజం. కోఆపరేటివ్ బ్యాంక్‌లో రెండువేలా అయిదు వందలు జమ ఉంది ఈరోజు ! ఏమంటావ్ ? అది ఎవరు సంపాయించిందీ కాదు, నీకు వచ్చిన కట్నం బాపతే! ఇంక అర్థంచేసుకో సంగతి సందర్భా తేమిటో" అన్నాడు ఓబయ్య.

"నా చదువుకు చేసిన రుణం కట్నంతో తీర్చారుగా."

"ఎంత ? కొంత ! నీ చదువుకు మీవాళ్ల బాధ్యతేమీ ఉండనవసరంలేదా ? నువ్వు పుట్టినప్పటినుంచీ అయిన ఖర్చులు గూడా నీ భార్య కట్నమిచ్చి తీర్చుకోవల్సిందే నన్నమాట! ఆమెకూ నీకూ మిగిలిం దేమిటి ? పోనీ అలానే అనుకున్నా ప్రస్తుతం బ్యాంకులో ఉన్న డబ్బు అక్షరాలా నీదేనయ్యా అమాయకుడా ! .... మీ వదినె బంగారం యిస్తానన్నదీ అంటే ఎందు కివ్వదూ ? ఆవిడకు పట్టూ విడుపు మహ బాగా తెలుసు. సంసారాన్ని—ముఖ్యంగా నిన్ను—చెయ్యిదాటి పోనీకుండా ఎలా సర్ది మాటాడాలో తెలుసు. ఒకవైపు మొగుడు బిగదీస్తూ ఉంటే ఇంకోవైపు ఈమె సర్దుకొస్తూ ఉంటుంది. అదీ రహస్యం .... ఇన్ని అనుమానాలూ ఆలోచనలూ ఎందుకు ? ఉన్న సంగతేమిటో కచ్చితంగా తేల్చుకుంటే మంచిదికదా ! ముసుగులో గుద్దులాట ఏనాటికీ మంచిదికాదు.... నన్ను అడగమంటే ఈ సంగతి మీ నాన్ననే అడిగేస్తాను—నిజానిజాలు తేలిపోతాయి...."

శ్రీధర్ ఆలోచనలో పడ్డాడు. తను చదువు మానేసి ఉద్యోగంలో చేరటాన్ని గూర్చి ఒకసారి నాగరాజే అన్నాడు : "మీ మామగారు సాయం చెయ్యకపోతే పోనీ, ఆ వచ్చిన కట్నం ఏంజేశావోయ్ ?" అని. ఆ విషయమై తండ్రినీ అన్ననూ ప్రశ్నించటం భావ్యంకాదనీ, ప్రశ్నించే అవకాశమే లేదనీ, అనుకున్నాడు అప్పట్లో. ఇప్పుడు ఓబయ్యమామ 'మాటలూ, అందుకు తగినట్లే యింటిలో జరుగుతున్న ముసుగులో గుద్దులాట' చూస్తే ఇందులో ఏమిటో ఉన్నట్లే తోస్తోంది.

• కాని ప్రస్తుతం తండ్రి ఉన్న అనారోగ్య పరిస్థితిలో వెళ్లి ఆయన్ని ఏమని ప్రశ్నించేది ? ఆయనకు మాత్రం తెలీదా కట్నం డబ్బు ఏమైందో ! అన్నయ్య, శ్యామల పెండ్లి కోసం, ఆ డబ్బులో మిగిలినదాన్ని బాంక్‌లో దాచిఉంచటమే నిజమైతే తను నోరువిడిచి ఎలా అడగటం ? శ్యామల తనకి మాత్రం కొమార్తెకాదా ? ....

ఆ రాత్రి చాలసేపు ఓబయ్యా, మంగమ్మా బోధించారు ఎవరి భవిష్యత్తు, సంసారం వాళ్లు చూచుకోవటం ధర్మమని .... తారకక్కూడా మంగమ్మ అన్ని విషయాలూ నూరిపోసిందేమో తార సైతం ఒకవైపు వత్తిడి పెట్టటం ప్రారంభించింది, రాత్రి పడుకున్నతర్వాత .... వినలేక కళ్లు మూసుకున్నాడు నిద్ర నటిస్తూ. అంతటితో తార మాట్లాడటం ఆపేసింది. కాని శ్రీధర్‌కు నిద్రపట్టనేలేదు.... నిద్రెలా వస్తుంది ! దుఃఖం వస్తోంది .... గట్టిగా ఏడవాలనిపిస్తోంది.

నాగరాజు .... శేషాద్రిగారు .... స్మృతిపథంలో మెదిలారు .... తన ఆదర్శవృక్షం కూలిపోతోంది..... ఆ విద్యార్థి జీవితానికీ, నాగరాజు స్నేహానికీ, శేషాద్రిగారి ఆధ్యాత్మిక స్వప్నానికీ, ప్రేమకూ, ఆర్ద్రతకూ తనెంతో దూరంలో ఉన్నాడు ! తను వంచితు డయ్యాడు, తన కెవరూ లేరు ! తను ఏ నీడలో పెరిగాడో, ఏ నీడను నమ్ముకొని బ్రతుకేర్పాటు చేసుకున్నాడో ఆ నీడే పాము నీడలా కదులుతూ మెదులుతూ ఉంటే ఏం చేయాలి, ఎక్కడికి పారిపోవాలి ? అన్నయ్య, వదినె, తండ్రి

వీళ్లే ఒక నాటకమాడి తన్ను దూరంగా గెంటివెయ్యాలని చూచే పరిస్థితి సంభవించినప్పుడు తను చెయ్యగలిగే దేముంది?

తనకు మిగిలింది తారా, పాపాయీ !

శ్రీధర్ ఏమీ నిశ్చయించుకోలేకపోయాడు తన కర్తవ్యాన్ని గురించి. రాత్రి జాగరణతోనే తెల్లవారింది ...

ప్రొద్దున పడకమీదనుండీ లేవకుండా అలానే పడుకుని ఉన్నాడు బద్ధకంగా.

మంగమ్మ భర్తతో అన్నది : ''సిరికి అడిగే ధైర్యం ఎక్కణ్ణుంచి వస్తుందండీ ! మీరు వెళ్లి కనుక్కోండి ....''

ఓబయ్య కొంచెం తటపటాయించాడు. చివరకు వెళ్లటానికే నిశ్చయించుకొని శ్రీధర్‌తో అన్నాడు : ''నేను వెళ్లి మీ నాన్నగారి ఆరోగ్య మెలాఉందో కనుక్కుని వస్తాను.'' అలా సూచనగా అంటే శ్రీధర్ ఏమంటాడో, తన రాయబారానికి అభ్యంతర మేమైనా చెబుతాడేమోనని ఎదురుచూచాడు ఓబయ్య. జవాబు రాలేదు. బయల్దేరాడు.

ఓబయ్య వెళ్లగానే శ్రీధర్‌కు తోచింది : తండ్రి ఓబయ్యమాటంటే సదభిప్రాయమూ లేదు, గౌరవమూ లేదు. ఈయన వెళ్లి ఆయన్ని ప్రశ్నిస్తే ఫలితం నవ్యంగా ఉంటుందా, కాని, ఎవరో ఒకరు వెళ్లాలి, అడగాలి, అందుకు ఓబయ్య మామకంటె మరొకళ్లు ఎవరున్నారు ? ఫలిత మెలా ఉన్నా అడగదలచిన విషయమేదో అది తండ్రిదాకా ఎలాగో వెళ్లటమే మంచిదనిపించింది.

భోజనంవేళకు ఓబయ్య తిరిగి వచ్చాడు.

''నాకు తెలుసుగా మీనాన్న పెడసరపు మనిషి అని ! అయితేనేం ? న్యాయ మడగటానికి ఎవరైతేనేం, అని వెళ్లాను. ....నీ చదువు సంగతి ఎత్తాను. ఆ బ్యాంక్‌లో ఉన్న డబ్బేం జేస్తుంది బావా ? ఇదేమన్నా రహస్యమా దాగటానికి ?'' అని అడిగేశాను. 'నీ కనవసరం ఇందులో జోక్యం' అన్నట్టుగా, మహా ఘరానాగా ఏదో సమాధానం చెప్పబోయాడు. 'మీ అబ్బాయి కనుక్కోమంటేనే నేను కనుక్కుంటున్నాను. నాదేముందీ, యిన్నాళ్లూ ఏ సంగతైనా మీ సంసారాన్ని గూర్చి జోక్యంచేసుకుని అడగవలసి వచ్చిందా నాకు ? వాడు నోరులేని వాడని యిలా చేస్తారా ?' అన్నాను. దానితో మీనాన్న పస్తాయించి దారికివస్తూ 'ఓబయ్యా, నువ్వయినా పరాయివాడవు కావు, నీకు చెప్పగూడని విషయం ఏమీలేదు. నేనా కూర్చుంటే లేవలేని వట్టి అనారోగ్యం మనిషిని. పెద్దవాడు జాగ్రత్తగానే నెట్టుకొస్తున్నాడు ఈ గడ్డురోజుల్లో .... నువ్వు చెప్పిన డబ్బు —మా నేరేడుమ్రాను బావి పొలంలో కలిసే పొలం ఒక అర ఎకరం అమ్మకానికి వస్తోంది—దానికోసం అట్టే పెట్టానంటాడు వాడు. దాన్ని చదువుకు ఖర్చుపెట్టటం వాడికిష్టంలేదు, మరి వాడి యిష్టాన్ని గ్రహించాలి .... వాడి అభిప్రాయమూ సబబుగానే ఉందికద ....' అన్నాడు..... ఇంక ఆ కొనదలచిన అర్ధ ఎకరం సంగతీ నన్నడుగు చెబుతా ! అది ఒక కోమటిది ... కోమట్లు అంత సులువుగా పోగొట్టుకుంటారా ? ఇప్పటికి రెండేండ్లనుంచీ అదిగో యిదిగో అంటూనే ఉన్నారు. అదంతా వ్యాపారం కిటుకే కావచ్చు, కాని అది యిప్పట్లో తేలేవిషయం కాదు ! దాన్ని యీ సమయంలో ఒక వంకగా పెట్టుకుని మాట్లాడటం తప్పితే నాకు యిందులో నిజమేమీ కన్పించటంలేదు. పొలం కొనుక్కోవాలి అన్న ఉద్దేశమే ఉంటే రెండేండ్లనుంచీ ముందుపడి ప్రయత్నం చెయ్యకుండా వూరుకోవటం దేనికి ? డబ్బేమో శ్యామల పెండ్లికోసమే ! .... సరే వీళ్ల ఆంతర్యం కనుక్కోవాలి అని నే నడిగాను : 'ఆస్తిమీద పెద్దవాడికీ చిన్నవాడికీ సమానమైన హక్కులున్నాయి కదా బావా ! పెద్దవాడి ధోరణి వ్యవసాయంమీద అయితే చిన్నవాడి శ్రద్ధ చదువుమీద ! సమయానికి లేనిది చంకనాకనా ? ఇప్పుడు గాకపోతే ఎప్పుడు చదువుకుంటాడు వాడు ? పోనీ వాడి వాటా మేరకైనా ఆ పైకంలోనుంచీ యిప్పుడు సగ మివ్వటం న్యాయంకాదా ?' అన్నాను .... దానితో మీ నాన్నకు ఎక్కడలేని కోపమూ వచ్చి పెద్దగా ఆయాసపడిపోయాడు...... న్యాయమైన మాటకి కోపమెందుకు చెప్పు ! జబ్బుమనిషిని యింక రొప్పు పెట్టటం బాగాలేదని వచ్చేశాను. అసలు కీలకం మీ అన్నా వదినెల్లో ఉంది. ఇక పై సంగతి ఆలోచించుకోవాలిసిందే !''

శ్రీధర్‌కు ఓబయ్య మామ నడిపిన రాయబారం ఏమీ నచ్చలేదు. ఏవి అనగూడని మాటలో అవే నాలుగూ ఆయన అనేసి వచ్చినట్లు తోచింది. ''నేను వెళ్లి కనుక్కుంటానులే మామా'' అన్నాడు శ్రీధర్.

మధ్యాహ్నం మూడుగంటలకే బయల్దేరాడు యింటివైపు. మనస్సులో ఏమిటో దిగులుగా ఉంది. పరిస్థితి బొత్తిగా చెయ్యిజారి పోతున్నట్లు, తను వాంఛించని వూహించని పరిణామాలు తన బాధ్యతమీదుగానే గబగబా జరిగిపోతున్నట్లూ అనిపిస్తోంది అతనికి.

రుక్మిణమ్మ రామలింగయ్య గదిలో కూర్చుని ఆయనకు విసురుతూ ఉంది. తండ్రి గోడవైపు తిరిగి పడుకుని నిద్రిస్తున్నట్టున్నాడు. శబ్దం చెయ్యకుండా వెళ్లి ద్వారం దగ్గర నిల్చున్నాడు శ్రీధర్. వదినె విసనక్రతోనే శబ్దం చెయ్యవద్దని సూచించి, విసనక్ర అక్కడ పెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ లేచి వచ్చింది.

వంటయిల్లు చేరుకునేదాకా యిద్దరూ మాట్లాడలేదు. పీట వాల్చుకుని కూర్చున్నాడు శ్రీధర్.

కాఫీకి నీళ్లు పాత్రలో పోసి పొయ్యిమీద పెట్టి రుక్మిణమ్మ ''ఏం నాయనా, యింటికి దూరమై వాళ్లల్లో జేరిపోయావు ?'' అన్నది శ్రీధర్‌వైపు చూడకుండానే.

ఆమె శ్రీధర్‌కు 'నాయనా' అని పిలిచి ఎన్నేళ్లో అయింది. శ్రీధర్ హైస్కూలు చదువు పూర్తిచేశాక ఆమె 'నాయనా' అనటం మానేసింది. 'శ్రీధర్' అని పిలుస్తూ ఉంటుంది..... శ్రీధర్‌కి ఆనాటి తన చిన్నతనం, వదినె కాపురానికి వచ్చిన మొదటిరోజులూ జ్ఞాపకం వచ్చాయి.... కళ్లల్లో నీళ్లు తిరిగినట్లయి, మాట్లాడకుండా వూరుకున్నాడు.

వదినె అతనివైపు చూసి : ''ఆయన్నెందుకు పంపించావయ్యా ? అడగదల్చుకున్న దేదో నువ్వే వచ్చి అడగరాదా ?....

ఆ మనిషేం మాట్లాడాడో మీ నాన్నగారు రెచ్చిపోయారు. గుండెలో మళ్లీ నొప్పివచ్చి తల్లక్రిందులై పోయారు. నీ కింత మాత్రం యింగితజ్ఞానం లేకపోతే ఎందుకూ ఇంత చదువూ చదివి ?" అన్నది.

ఆమె తనని అలా మందలిస్తూండటమే ఎంతో తృప్తిగా ఉంది శ్రీధర్‌కు ..... అలానే కూర్చున్నాడు .... ఆమె తిట్లే దీవెనలు అన్న భావంతో .... ఎంత అనుభవించినా తనివి తీరని అనుభూతి అది ....

వదినె కొంతసేపు వూరుకున్నది. తర్వాత అన్నది కాఫీ కలుపుతూ ....

"అందరూ మొండివాళ్లే అయితే, తమ పంతాలే నెగ్గించుకోవాలంటే ఎలా సాగుతుంది చెప్పు. మీ అన్నగారికి నువ్వు పైకి చదవటమంటేనూ, చదువు ఉపయోగంమీదా పెద్ద నమ్మకంలేదు. ఇంతదాక చదివి ఏమైంది అంటారు .... నీకేమో చదువుమీదే నమ్మకం .... నాకేం తెలుస్తుంది, నే నెట్లా పడేది చెప్పు. ఏమైనా సరే నిన్ను చదువుకి పంపించమన్నాను, ఒప్పుకోలేదు. రెండేళ్లనుంచీ వానలులేక సేద్యం నానా యిబ్బందిగా ఉంటూ ఆయనకు మనసు బాగుండటంలేదు. మరి యిప్పట్లో, నేను నిన్న చెప్పలేదా నీతో కాసులపేరు తీసుకు పొమ్మని, అంతకంటే చేసేదేముంది ?" రుక్మిణమ్మ శ్రీధర్‌కు కాఫీ అందించింది.

"దానికి మాత్రం అన్నయ్య వప్పుకుంటాడా, వదినా ?"

"ఏమో, నేను చెయ్యగలిగింది అంతే" అంటూ పొయ్యి వైపు తిరిగి కూర్చున్నది రుక్మిణమ్మ. ఆమె పైట చెరగుతో కళ్లు తుడుచుకుంటూ ఉండటం గమనించాడు శ్రీధర్.

"నువ్వేం బాధపడవద్దు వదినా ! పై చదువు లేక పోతేనేం ? ఏదో ఉద్యోగం దొరుకుతూంది. యివాళ కాకుంటే రేపు .... ఏ ఉద్యోగమూ లేకపోతే మడకా ఎడ్లూ ఉండనే ఉన్నాయి. నాన్నగారి కెలా ఉంది ?"

"మళ్లీ నొప్పివచ్చింది ..... నువ్వొచ్చే ముందరే కాస్త కునుకుపట్టింది."

శ్రీధర్ లేచి రామలింగయ్య గదిలోకి వెళ్లాడు. ఆయనలో కదలికలేదు. గుర్రు వినిపిస్తోంది.

శ్రీధర్ మళ్లీ వంటింట్లోకి వచ్చాడు.

"తార తన ట్రంకుపెట్టెకోసం కబురంపితే పంపించాను. వాళ్ల నిక్కడికి తీసుకువచ్చెయ్‌రాదూ. వాళ్లక్కడుండటం, నువ్వూ అక్కడికే వెళ్లవలసి రావటం నాకేమీ బాగులేదు సిరీ !" అన్నది రుక్మిణమ్మ.

"అలాగే వదినా ! పాపాయిని ఆస్పత్రికి తీసుకెళ్లటానికి వీలుగా ఉంటుందని రెండు రోజులు అక్కడే ఉంటానన్నది తార అంతే !"

"మన యింటి వ్యవహారాల్లో మీ అత్తావాళ్లు కల్పించుకోవటం మన మంచికి కాదయ్యా. నువ్వు జాగ్రత్తగా ఉండాలి." అన్నదామె.

శ్రీధర్ ఏమీ సమాధాన మివ్వలేదు.

ఇంతలో శ్యామల స్కూలునుంచి వచ్చింది.

"ఏమిటి, దర్శనమే లేదే చిన్నాన్నా ! ..... పాపాయినీ పిన్నినీ తీసుకెళ్లి దాచిపెట్టుకున్నావ్ !" అంటూ శ్రీధర్ ప్రక్కన వచ్చి నగం పీటమీద ఆనుకుని కూర్చున్నది శ్యామల.

"వస్తారు లేవే, పాపాయిని ఆస్పత్రిలో చూపించాలని అక్కడే ఉన్నారు" అన్నాడు.

శ్యామల తల్లి యిచ్చిన కాఫీ పూర్తిచేసి, శ్రీధర్ జేబులో తొంగిచూస్తున్న పర్సు పైకి లాగింది.

"మీ మంగమ్మత్త ఏమాత్రం యిచ్చిందో డబ్బు !"

"ఏమిటే అది, పెద్దా చిన్నా లేకుండా ఏమిటా మాటలు ? నీకెందుకీ పెత్తనాలూ ?" అని మందలించింది రుక్మిణమ్మ.

"నాకు ఎంబ్రాయిడరీ దారాలు కావాలె ! నువ్వు తెచ్చి పెట్టవా చిన్నాన్నా ?" గోముగా అడిగింది శ్యామల.

"తెస్తానులే, ఎప్పుడు కావాలి ?" అని నవ్వుతూ అడిగాడు శ్రీధర్.

"ఎప్పుడేంటి ? రేపు ప్రొద్దుటికే కావాలి .... ఇప్పుడు నీకేమైనా పనుందా ? తెచ్చిపెట్టకూడదూ ?"

"నాకు పనే ఉంది .... నువ్వే తెచ్చుకో" అని ఒక రూపాయ కాగితం తీసి శ్యామల కిచ్చాడు పర్సులోనుంచి.

"మెనీ థాంక్స్" అని గంతులేసి పారిపోయింది శ్యామల.

* * * *

తర్వాత రెండు రోజులు శ్రీధర్ మంగమ్మ ఇంట్లో తారామంగమ్మల చేతుల్లో యించుమించు బంధితుడే అయ్యాడు. శ్రీధర్ పై చదువు సంగతి ఎటో తేలేదాకా తార తన అత్తవారింట్లో అడుగుపెట్టనని భీష్మించింది. శ్రీధర్‌కు కోపం వచ్చింది. మంగమ్మ ఓబయ్యలు తారను సమర్థించారు. ఆమెను మాట్లాడనివ్వకుండా వాళ్లే ఆమె తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడటం ప్రారంభించారు. ఓబయ్య వెళ్లి నరసింహుల్ని కలుసుకొని వచ్చాడు. "అవసరమైతే పంచుకుని వెళ్లమను" అని నరసింహు అన్నాడని కబురు తెచ్చాడు. శ్రీధర్ చలించలేదు. "ఏమన్నా సరే ! నేను మాత్రం ఆస్తి భాగాలు పెట్టమని అడగను. వెళ్లి ఆ యింట్లోనే ఉంటాను." అన్నాడు గట్టిగా.

చివరకు ఓబయ్య ఒక సలహా చెప్పాడు : "నువ్వేదో ఆపేక్షగా మీ వదినె తియ్యని మాటలు నమ్మి మీ అన్న వైఖరి పసిగట్టలేకుండా ఉన్నావు. అది ఎలా ఉన్నా ఈ పరిస్థితుల్లో చిక్కుపడి నువ్వు అనవసరంగా నీ చదువూ, భవిష్యత్తూ పాడు చేసుకోవడం ఏమీ బాగులేదు.... నా సలహా ఏమిటంటే, నీక్కావలసిన వెయ్యో రెండువేలో నాదగ్గర తీసుకొనివెళ్లు. నాకైనా వేరే ఎవ్వరూ లేరు, కొడుకువైనా అల్లుడివైనా నువ్వే ! అయితే అది నువ్వు రుణంగా తీసుకుని వెళ్లడమే మంచిది. బాధ్యత మీ కుటుంబంమీద పెట్టు, తర్వాత చూద్దాం."

మరునటిరోజు శ్రీధర్ పట్టుపట్టడంతో తారా, పాపాయీ యింటికి తిరిగి వచ్చారు. వారం రోజుల్లో ఓబయ్య శ్రీధర్‌కు పదిహేను వందల రూపాయలు రుణంగా యిచ్చే ఏర్పాట్లు పూర్తిచేసి బ్యాంక్ డ్రాఫ్ట్ తెచ్చి యిచ్చాడు.

శ్రీధర్ వదినెతోనూ, తండ్రితోనూ ఓబయ్యా, మంగమ్మలు తన చదువు ఖర్చులు భరించటానికి అంగీకరించారని చెప్పాడు. రుణపత్రం విషయం చెప్పలేదు. సమస్య ఏదో విధంగా తృప్తికరంగానే విడిపోయిందని వాళ్ళిద్దరూ సంతోషించారు.

శ్రీధర్ చదువు విషయం నరసింహులితో ఒకరోజు ప్రస్తావించాడు. "నేను టీచరు ట్రెయినింగ్ చదవాలనే అనుకున్నాను. మంగమ్మత్త డబ్బిస్తా నన్నది. నీ అభిప్రాయ మేమిటి ?"

"ఇందులో నా అభిప్రాయ మేముందీ ? మన కుటుంబ స్థితిగతులను బట్టి చూస్తే నువ్వింకా చదువుతూ ఉండటం నాకిష్టంలేదు. ఆ శక్తి మనకు లేదు. పైన నీ యిష్టం" అన్నాడు నరసింహులు. అతను ఎప్పుడూ ఎక్కువ మాట్లాడడు. చెప్పేదేదో కచ్చితంగా, కఠినంగానే చెప్పటం అతని స్వభావం.

శ్రీధర్ మనస్సుకి ఆ మాటలు కష్టమే కలిగించాయి.

జులై రెండవవారంలో శ్రీధర్‌కు కాలేజిలో ప్రవేశం లభించినట్లు తెలిసింది. మద్రాసుకు వెళ్లటానికి ప్రయాణం కట్టుతున్నాడు. తార తను బందరు వెళ్తానన్నది. అప్పటి కామె వచ్చి నెల రోజులు కూడా పూర్తికాలేదు.

"మీరు మద్రాసులో ఉంటే నే నిక్కడేం చేసేదండీ ? నా కీవూళ్లో ప్రొద్దుపోదు ..... మీ వదినెగారేమో నన్ను వంటింట్లోకి రానివ్వదు .... పాపాయిని చూసుకోవటం తప్ప నేను చేసే నిర్వాకం ఏమీ ఉండదు. ఆ పని బందరులోనే చేస్తాను" అన్నది తార.

"మద్రాసు వెళ్లగానే ఏదైనా ఫామిలీ పోర్షన్ దొరికితే అద్దెకు తీసుకుంటాను. నువ్వు రావచ్చు" అన్నాడు శ్రీధర్.

"డబ్బు చాలుతుందో లేదో ! ఎందుకొచ్చిన యిబ్బంది ? సంసారం పెడితే మీ చదువూ సాగదు .... నన్ను బందరులో ఉండనివ్వండి."

శ్రీధర్ రుక్మిణమ్మను అభిప్రాయం అడిగాడు. ఆమె అన్నది : "ఏమో ! శ్రీధర్ ! నేను చదువుకోలేదు. తార చదువుకున్నది. నే నామెకు అత్తగార్నీ కాను తీర్పి దిద్దేందుకు.... మీ యిద్దరికీ ఏది నచ్చితే అలా చెయ్యండి .... ఆలు మగల మధ్య సలహా చెప్పటం అట్టే బాగుండదు....."

ఆమెకూ తారకూ పొంతనాలు కుదరలేదని శ్రీధర్ గ్రహించాడు. కాని ఆ విషయమై తనేం చెయ్యాలో అతనికి బొత్తిగా అయోమయంగా ఉంది..... తారను బందరు పంపటానికే నిశ్చయించాడు చివరకు, తన మనస్సుకు తృప్తిగా లేకపోయినా. ఆమెను మళ్లీ బందరులో ఎవరు దిగబెట్టి వస్తారు ? మద్రాసు వెళ్లి కాలేజిలో చేరి వచ్చి ఆమెను బందరు తీసుకవెళ్తా నన్నాడు శ్రీధర్.

మద్రాసు ప్రయాణానికి ముందు రోజు సాయంత్రం ఆంజనేయస్వామి గుడికి వెళ్లాలనుకొని, షికారుగా చెరువు గట్టువైపు వెళ్లాడు శ్రీధర్ .....

ఒక్కనెలలో తన జీవితం ఒక పెద్ద మలుపు తిరిగినట్లనిపించింది అతనికి ఆలోచిస్తుంటే. పూర్వం కంటె తార తనకు సన్నిహిత మైనట్లే—దానిక్కారణం మంగమ్మత్త ప్రభావం తారమీద పనిచేస్తుండటం ..... కాని మంగమ్మత్త మూలంగానే ఇంకోవైపు తనూ తారా, అన్నా వదినెలకు దూర మవుతూన్నట్లే ఉంది .... ఒకరికి దగ్గర కావటంతో మరొకరికి దూరం కావటం తప్పే మార్గమే లేదా ? అందుకు తన బాధ్యత ఎంతవరకు ? ఈ పరిస్థితిలో తను చెయ్యగలిగిందేమీ లేదా ?

శ్రీధర్‌కు తను చెయ్యగలిగిందేమీ లేదని తోచింది. ఇంతవరకు తను బుద్ధిపూర్వకంగా జోక్యం కలుగజేసుకుని నిర్వహించిందీ తక్కువే ! తన చదువు విషయమై ఇంత రభస జరుగుతుందని కానీ, అన్నయ్య ప్రాతికూల్యం చూపిస్తాడని కానీ, చివరకి ఓబయ్య మామ తనమీద యిలా అపేక్ష చూపిస్తాడని కానీ అత నెప్పుడూ వూహించనేలేదు ! అందుకే కాబోలు జీవితాన్ని పడవతో పోలుస్తారు. అలల తాకిడిలో నీటి ఎగుడు దిగుడులమీద వూగే పడవకు స్వయం నిర్ణయం ఎంతవరకు ? ఇది చాల క్లిష్టమైన ప్రశ్నగా తోచింది శ్రీధర్‌కు తన అనుభవాన్నిబట్టి ఆలోచిస్తుంటే ....

సూర్యబింబం అదృశ్యమైంది. సంజ వెలుగులో చెఱువు కట్టమీద నడుస్తున్నాడు దేవాలయంవైపు శ్రీధర్.

"ఇల్లలికి ముగ్గెట్టి మల్లెల్లు విరజల్లి
మల్లెల్లో ఉండేటి ఓ మల్లి నాగా
ఇవతల యిది కొండ అవతల అది కొండ
నట్టనడుమను కొండ నల్లతాచయ్య !"

ఈడిగపల్లివైపు నడుస్తున్న యిద్దరు కుర్ర పిల్లవాళ్లు—ఒకడు పిల్లనగ్రోవి వూదుతూ మరొకడు పాడుతూ—ఎదురు వస్తున్నారు. పాట శ్రీధర్‌ని ఆకర్షించింది. వాళ్లను ఆపి పాట పూర్తిగా పాడమన్నాడు. వాళ్లు వింతపడి సిగ్గుపడుతూ నాలుగు చరణాలూ పాడారు. ఆపైన రాదన్నారు. పోనీ యింకొక పాట యిలాంటిదే ఏదైనా వస్తే పాడమన్నాడు శ్రీధర్.

"కాయమనే పుట్టలోను చందమామ
మాయగానే మెలగివుండు చందమామ
జంట నాగస్వారాలూది చందమామ
పాము పుట్ట పెకలించుకో చందమామ."

మొదటిపాటే అందంగా ఉందనిపించింది శ్రీధర్‌కు. మొదటి చరణాలే మళ్లీ వాళ్లచేత అనిపించి చెరొక అణా వాళ్ల

చేత పెట్టాడు. వాళ్లు బీడీ గాని, సిగరెట్టు గాని ఉంటే ఇవ్వ మని అడిగారు. "లేదు" అని బయల్దేరాడు శ్రీధర్.

దేవాలయం తలుపులు మూసి ఉన్నాయి.

పోనీ శేషాద్రిగారి నొకసారి కలుసుకుందా మనిపించింది శ్రీధర్‌కు. ఆయన యింటికి బయల్దేరాడు ....

"ఇవతల ఇది కొండ అవతల అది కొండ

నట్టనడుమను కొండ నల్ల తాచయ్య!" ఇటు మంగమ్మతా, ఆటు రుక్మిణమ్మ వదినా నట్టనడుమను ఆ నల్లత్రాచు తనే అని పోల్చుకుంటూ నడిచాడు శ్రీధర్.

శేషాద్రిగారు ఇంట్లో లేరు. సుమారు ముప్పై ఏళ్ల యువతి, ఇదివరకు వీధిలో వెడుతూండగా తరచు చూచిన ఒక వితంతువు, బయటికివచ్చి "నాన్నగారు వూళ్లో లేరు, బహుశా రేపు వస్తారు" అన్నది.

"ఓహో ఈమె శేషాద్రిగారి కొమార్తా!" అనుకుంటూ శ్రీధర్ తిరిగి వచ్చేస్తుంటే,

"మీ రెవరండీ? నాన్నగారితో నేను చెబుతాను" అన్న దామె.

"ఈ వూరే....శ్రీధర్ అని చెప్పండి తెలుస్తుంది. నేను రేపు మద్రాసు వెడుతున్నాను......బి. టి. లో చేరటానికి వెడుతున్నానని చెప్పండి......అంతే మరేం విశేషం లేదు."

ఆమె అతనివైపు తదేకంగా చూస్తూ "అలాగే" అని తల పంకించింది......

## 9

మళ్లీ మద్రాసులో విద్యార్థి జీవితం ప్రారంభించటం శ్రీధర్‌కు తెరిపిన పడ్డట్లుగా వుంది. అతనికి క్రొత్త స్నేహితు లెవ్వరూ లేదు. బి. టి. విద్యార్థులు సమ వయస్కులుగా ఉండరు. వాళ్లల్లో కొంతమేర జీవితాన్ని చూచివచ్చినవాళ్లూ, అప్పుడే డిగ్రీ పుచ్చుకున్నవాళ్లూ, మంచి మార్కులతో ప్యాసైనవాళ్లూ, ఎలాగో బి. ఎ. అయిందనిపించుకున్న వాళ్లూ అన్ని రకాలూ ఉంటారు. శ్రీధర్ హాస్టలులోనే ఉంటున్నా, సన్నిహితుడైన స్నేహితుడెవరూ లేకుండా ఒంటరితనం అనుభవిస్తూనే ఉన్నాడు. తరచు సినిమాలకు వెళ్లటం, ఆదివారం మేటినీ తప్పకుండా చూడటం అలవాటైంది అతనికి.

అప్పటికి కాలేజిలోచేరి నెలరోజులైంది. ఒక ఆదివారం ఇంగ్లీషు చిత్రం మేటినీ చూచి శ్రీధర్ బయటికి వస్తున్నాడు. అతని సహాధ్యాయిని చంద్రావతి కూడా అదే చిత్రం చూచి ప్రక్క ద్వారం నుంచి బయటికి వస్తూ, గుంపులో అతని దగ్గరకు చేరటం తటస్థించింది. అతన్ని చూడగానే ఆమె చిరునవ్వుతో పలకరించింది ఇంగ్లీషులో.

"ఎలా ఉందంటారు పిక్చర్?"

"బాగానే ఉందనుకొంటాను."

ఇద్దరూ జనంలో ముందుకు సాగుతున్నారు మెల్లగా.

"బహుశా మీరింకా మీ విమర్శనశక్తికి పని కల్పించలేదనుకుంటాను" అన్నది చంద్రావతి.

"ఊఁ" అన్నాడు శ్రీధర్ తలపంకిస్తూ, ఏం జవాబు చెప్పాలో తోచక.

గేటు సమీపించగానే జనసమ్మర్దం పలచబడటంతో కాస్త వూపిరి తీసుకోటానికి వీలైంది. చంద్రావతి టాక్సీని పిలిచింది.

"మిస్టర్ శ్రీధర్! మీరెటు వెళ్లాలి?...నాతోరండి అభ్యంతరం లేకపోతే" అంటూ చంద్రావతి, జవాబుకోసం ఎదురు చూడకుండానే, టాక్సీలో ఎక్కి కూర్చున్నది. శ్రీధర్ ఒక క్షణం టాక్సీలో ముందు కూర్చోవాలో వెనక కూర్చోవాలో తెలీక నుంచున్నాడు...."ఇటే రండి" అంటూ ఆమె వెనుక సీట్లోకే ఆహ్వానిస్తూ ప్రక్కకు ఒదిగి కూర్చున్నది. శ్రీధర్ టాక్సీ ఎక్కిన తర్వాత ఆమె డ్రైవర్‌కు త్యాగరాయనగరం అడ్రస్ చెప్పింది.

చంద్రావతి వివాహిత. శ్రీధర్‌కంటె మూడు నాలుగేళ్లు పెద్దది. మనిషి నిండుగా, హుందాగా ఉంటుంది. మేలిమి బంగారు ఛాయ, కళ్లకు అద్దాలు, ప్రసన్నమైన ముఖం. క్లాసులోవున్న అయిదువంది విద్యార్థినుల్లోనూ అభిజాత్యమూ, అందమూ వున్న వ్యక్తి ఆమె ఒక్కర్తే. ఆమె సాధారణంగా ఎవరితోనూ మాట్లాడదు. మాట్లాడినప్పుడు ప్రతిమాటా తూచినట్లు మాట్లాడుతుంది. ఆమె ధోరణిలో ఆత్మవిశ్వాసమూ, సంస్కారమూ ఉట్టిపడుతూ ఉండటం ఇదివరకే శ్రీధర్‌దృష్టి నాకర్షించింది. ఆమె సరిగ్గా కాలేజి వేళకు సొంతకారులో వస్తుంది, కాలేజి అవగానే వెళ్ళిపోతుంది. ఆమె భర్తకు బర్మాషెల్‌లో ఉద్యోగమనీ, వాళ్ళు భాగ్యవంతులనీ అందరికీ తెలుసు. అందుకే శ్రీధర్ ఆమెనుగూర్చి పట్టించుకోనూ లేదు, పలకరించే ప్రయత్నమూ చెయ్యలేదు.

బి. టి. క్లాసులో చేరిన మొదటి రోజుల్లో ఒకసారి లెక్చరరు ఒక్కొక్కరినీ వాళ్లెందుకు ఉపాధ్యాయవృత్తిని ఎన్నుకున్నారని ప్రశ్నించాడు. "జీవితంలో ఏదో వ్యాసంగం అంటూ ఉండాలి. పిల్లలకి చదువు చెప్పటం నా కిష్టమనుకుంటాను. అందుకే ట్రెయినింగ్‌లో చేరాను" అన్నది చంద్రావతి తనవంతు వచ్చినపుడు. "అనుకోవటమేనా?" అన్నాడు లెక్చరరు కుతూహలంగా. "అదేదో చేసిచూస్తేగాని మరి తెలీదు కదండీ!" అన్నది చంద్రావతి. అందరూ నవ్వారు. అప్పుడే తెలిసింది, భాగ్యవంతురాలైన చంద్రావతి కేవలం ఆసక్తితో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించబోతోందని.

తలవని తలంపుగా ఇవ్వాళ చంద్రావతి తనను పలకరించి తనతో మాట్లాడటం శ్రీధర్‌కు సంతోషమే కలిగించింది. కాని ఆమెతో ఎలా మాట్లాడాలో అతనికి ఒక సమస్యగావుంది. వివాహితలైన స్త్రీలు, బంధువుల్లో ఒకరిద్దరుతప్ప, అతనికి పరిచితులెవరూ లేరు. వాళ్లైనా చదువుకున్నవాళ్లు కారు.

"మొన్న క్లాసులో జరిగిన తర్జన భర్జనల్లో మీవాదం ఆసక్తితో విన్నాను. నేను మీతో ఏకీభవించలేకపోయినా.....నా అభిప్రాయమేమిటో అందరిముందూ వాదనకి పెట్టటానికి ఇష్టంలేక వూరుకున్నానుగాని, అవకాశంవస్తే మీతో ఒకసారి చర్చించాలి అనుకున్నాను సుమండీ!" అన్నది చంద్రావతి తెలుగులో సన్నిహితంగా మాట్లాడుతూ.

"ఏదో అప్పటికి తోచింది చెప్పానుగాని నేనుమాత్రం పెద్దగా ఆలోచించి విమర్శించి అన్నముక్కలు కావు" అన్నాడు శ్రీధర్.

"అప్పుడే తప్పించుకోవాలని చూస్తున్నా రేమిటీ?" అన్నది చంద్రావతి నవ్వుతూ.

"లేదు" అని శ్రీధర్ కూడా నవ్వేసి వూరుకున్నాడు.

ఆమెకు తనమీద ఆసక్తి ఎందుకు కలిగిందో, ఎలా కలిగిందో తెలుసుకోవటంతో శ్రీధర్‌కు ఆత్మసంతృప్తి, కించిద్గర్వమూ కలిగాయి.

శిశు మనస్తత్వం విషయాన్నిగూర్చి చెబుతూ, లెక్చరరు నైతికాదర్శము అనేది చిన్నతనంలో చదువులో ఒకభాగంగా శిక్షణగా ఎలా రూపొందాలో కొన్ని భావాలు చెప్పి చర్చించమన్నాడు విద్యార్థుల్ని. ఆ సందర్భంలో ఒక విద్యార్థి సమస్యనొకదాన్ని లేవదీశాడు.

పాఠశాలకు చెందిన పూలతోటలో పువ్వులెవ్వరూ కోయగూడదనే నియమం ఉంటుంది. ఒక ఆదివారం ఎవ్వరూ లేనప్పుడు ఇద్దరు పిల్లలు అటువైపు వెడతారు. అందులో ఒకడు ఇంకొకడు వారిస్తున్నా వినకుండా కొన్ని పువ్వుల్ని కోస్తాడు. మరుసటిరోజు ఆ విషయమై పువ్వులెవ్వరు కోశారని ఉపాధ్యాయుడు అందరినీ ప్రశ్నిస్తాడు. ఆ సమయంలో పువ్వులు కోసినవాని స్నేహితుడి కర్తవ్య మేమిటి? తనకు తెలిసిన నిజం బయట పెట్టాలా లేదా?

చర్చింపగా తేలిన సమస్య: సాంఘికమైన ధర్మమూ, వ్యక్తిగతమైన స్నేహధర్మమూ ఒక దానితో ఒకటి తలపడే పరిస్థితి వచ్చినపుడు ఏది దేనికి లొంగిపోవాలి?......కొందరు ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో సహజీవనమూ పురోభివృద్ధి సాంఘికమైన క్రమశిక్షణమీదే ఆధారపడిఉందనీ, సాంఘిక ధర్మమే ప్రధానమనీ, వ్యక్తిగతమైన స్నేహధర్మం దానికి లొంగవలిసిందేననీ వాదించారు......మరికొందరు వ్యక్తిధర్మమే ముఖ్యమైనదని వాదించారు......కమ్యూనిస్టు రాజ్యాల్లో సాంఘికమైన ధర్మం ప్రధానం కావటంవల్ల తండ్రీ కొడుకులూ, భార్యాభర్తలూ కూడా ఒకరిమీద ఒకరు గూఢచారులుగా ప్రవర్తిస్తూ, వ్యవస్థకోసం ప్రేమధర్మాన్ని బలిపెట్టడం జరుగుతుందనీ, అందువల్ల వ్యక్తిగతమైన పరస్పరతాధర్మం నశించి, క్రమంగా ఒకరిమీద ఒకరికి నమ్మకం లేకపోవటంతో, భయం మూలంగా చివరకు జీవితమే నరకమైపోతుందనీ వాదించారు.

శ్రీధర్‌మాత్రం ఈ రెండు ధర్మాలకూ ఒక సమన్వయాన్ని ప్రతిపాదిస్తూ, సంఘ ధర్మమూ, వ్యక్తిధర్మమూ క్రమంగా ఒకటి కావాలి అన్నాడు. స్నేహితుడైన పిల్లవాని బాధ్యత, ధర్మం ఏమిటంటే పువ్వుల్ని కోసినవాణ్ణి వాడు తన తప్పు తను గ్రహించి, అందరిముందూ ధైర్యంగా అంగీకరించి శిక్ష ననుభవించేటట్లు చెయ్యటానికి అతణ్ణి స్నేహం ద్వారా ఒత్తిడి పెట్టటమేననీ, ఇదే గాంధీమార్గమనీ చెప్పాడు.

ఈవిధంగా ప్రపంచంలో ప్రస్తుతయుగంలో మౌలికమైన సమస్యను—సంఘానికీ, వ్యక్తికీ జరుగుతున్న సంఘర్షణను—దానికి సంబంధించిన మూడు మార్గాలను నిర్వచించటం జరిగిందని చివర లెక్చరరు వ్యాఖ్యానించాడు. యధార్థంలో పరిస్థితులూ, సమస్యలూ ముఖ్యంగా పాఠశాలల్లో వాదనలో చర్చించినంత తీవ్రంగా ఉండవనీ, ఒక సంఘటనలో ఇటూ అటూ అయినా సంఘానికీ, వ్యక్తికీ సామాన్యంగా ఒక సామరస్యం ఉంటూ ఉంటుందనీ, ఆయన వాస్తవికత దృష్ట్యా చెప్పాడు. అయితే పాఠశాల ఒక సంస్థ కావటంతో, అందులో వ్యవస్థాధర్మానికే అంటే సాంఘికమైన దృష్టికే, ఉపాధ్యాయుడు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వవలసి ఉంటుందనీ, అదే సాధ్యం అనీ తేల్చాడు.

టాక్సీలో వెడుతుండగా శ్రీధర్ పై చర్చ మళ్లీ జ్ఞాపకం తెచ్చుకున్నాడు; చంద్రావతి ఏమి చెబుతుందో ఏ విషయమై అభిప్రాయభేదం వ్యక్తం చేస్తుందోనని కుతూహలంగా వూహిస్తూ.

త్యాగరాయనగరంలో ఆమె యిల్లు చేరుకున్నది టాక్సీ. శ్రీధర్ టాక్సీ డబ్బివ్వబోతుంటే, చంద్రావతి "నో ప్లీజ్" అంటూ వారించి తనే యిచ్చింది.

అది క్రొత్తగా కట్టిన చిన్న మేడ. మేడమీద చెరోవైపు రెండు పడకగదులూ, మధ్య ఒక పెద్ద హాలూ, అటూ యిటూ వరండా ఉన్నాయి. ఇల్లు శుభ్రంగా, పరిసరాలు అందంగా ఉండటం శ్రీధర్‌కు ఎంతో హాయిగా ఉంది.

చంద్రావతి శ్రీధర్‌ను మేడమీద హాలులో పేము కుర్చీలో కూర్చోబెట్టి తను క్రిందికి వెళ్లింది. తర్వాత పది పదిహేను నిమిషాల్లో ఒక అయ్యరు కుర్రవాడు టీ, బిస్కట్లు, చిప్స్ వగైరా పట్టుకొచ్చాడు.

చంద్రావతి వచ్చి ఇంకో పేము కుర్చీలో కూర్చుంటూ "మీరు వాష్ చేసుకోవాలంటే ఇక్కడే లోపల బాత్‌రూం ఉంది." అంటూ ఒక గదివైపు చూపింది. శ్రీధర్ లోపలికి వెళ్లాడు. అది అతిథుల కోసం ఏర్పాటు చేయబడిన పడకగది కాబోలు, వాడుకుంటున్న గదిలా లేదు. దానికి అనుబంధంగా ఉన్న బా᳚రూమ్‌లోకి వెళ్లాడు శ్రీధర్ .....

అతను తిరిగివచ్చి కూర్చున్న తర్వాత టీ కలుపుతూ చంద్రావతి అన్నది :

"మీరు గాంధీ మతస్థులా ?"

"అవును" అన్నాడు బిస్కట్ చేతికి తీసుకొని శ్రీధర్. చర్చ ప్రారంభమైన దనుకున్నాడు.

"మీరు బ్రహ్మచారులా ?"

"కాదు."

"వ్యక్తిగతమైన ప్రశ్న అడిగితే ఏమనుకోకండి !— అయినా గాంధీ మార్గం ప్రకారం వ్యక్తికీ, సంఘానికీ మధ్య తెర ఏమీ ఉండకూడ దనేగా మీరు మొన్న చెప్పింది—అందు వల్ల నే నిలా ప్రశ్నించినా మీ కభ్యంతరం ఉండకూడదు !.... మీ కెంతమంది పిల్లలు ?" అన్న దామె నవ్వుతూ.

"ఒక అమ్మాయి."

వాదించటానికి కాదు, హేళన చెయ్యటానికి ఈమె తనను తీసుకు వచ్చిందా ? అన్న అనుమానం కలిగింది శ్రీధర్‌కు. కాని, ఆమె ముఖం స్నేహపూర్వకంగా ప్రసన్నంగా అతన్ని ఆక ర్షిస్తూంది. ఏమైనా సరే, ఆమెతో మనస్ఫూర్తిగా మాట్లాడా లనిపించింది.

"వయస్సు ?" అన్నది చంద్రావతి.

"ఇరవై నాలుగు దాటాను."

చంద్రావతి ఫక్కున నవ్వేసింది. నవ్వాపుకునేందుకు ప్రయత్నిస్తూ "మీ వయస్సు కాదు, మీ కూతురి వయస్సు?" అన్న దామె.

"ఏడు నెలలు .... మీ రివన్నీ ఎందు కడుగుతున్నారో ముందు చెప్పండి." అన్నాడు శ్రీధర్ కొంత బిగుస్తూ.

"క్షమించండి....అంతా చెబుతాను .... మీ క్కోపం వస్తోంది కదూ ! గాంధీ మతస్థులకి కోపం రాకూడదు మరి !... టీ పుచ్చుకోండి. చల్లారిపోతోంది .... చూడండి, గాంధీగారు వ్యక్తిగతంగా ఎంత గొప్పవారో మనకా సంగతి వద్దు. కాని మనం ఆయన హితోపదేశాల్ని గూర్చి మాత్రమే చర్చిద్దాము. ఆయన యువతీ యువకులకు బ్రహ్మచర్యాన్ని గూర్చి చేసిన హితోపదేశాలు, వివాహంయొక్క లక్ష్యాన్నీ, ప్రయోజనాన్నీ గూర్చి చెప్పిన మాటలు, స్త్రీ పురుష సంబంధాన్ని గూర్చి వ్యక్తంచేసిన భావాలూ— అవి మీ కెంతవరకు నచ్చాయో, మీ రెంతవరకూ వాటిని ఆచరణలో పెట్టగలిగారో చెప్పండి చూద్దాం.... అందుకే అలా ప్రశ్నలు వేశాను ...."

"సులభంగా అందుబాటులో ఉండేది, ఆదర్శమే కాదు. ఒక లక్ష్యాన్ని సాధించేందుకు వీలైనంతవరకు ప్రయత్నించ వలసిందే."

"ఇది జీవితానుభవం బొత్తిగా లేనివాళ్లు, పదిహేడు పద్దెనిమిదేళ్ల వాళ్లు మాట్లాడ వలసిన మాట శ్రీధర్ గారూ! ఏమంటే మీరనేదాంట్లో ఏ ఆదర్శమైనా సాధ్యమేననీ, ఎంత కష్టంగా వున్నతంగా కన్పిస్తే అంత మంచిదనీ, దాన్ని లక్ష్యంగా చేసుకుని సాధించలేక పోయినా దాని కోసం బాధ పడుతూ బ్రతకటం మంచిదనీ ధ్వనిస్తున్నారు. కాని అలా సాధ్యం కాదు. నిశితంగా పరీక్షించి చూస్తే అంత కంటే వ్యర్థమైన పని మరొకటి వుండదు. క్షణక్షణమూ మన ఆదర్శానికి భిన్నంగా బ్రతుకుతూ, ఎప్పుడో ఆదర్శాన్ని సాధిస్తామనే భ్రమతో ఆత్మవంచనలో పడివుండటం మేలంటారా!? అంత కంటే అనర్థం ఏం కావాలి? ఆలోచన ఒక తీరు, ఆచరణ మరొక తీరు అయిపోతే ఇక ఆ వ్యక్తికి గతి విమోచనం ఎలా వుంటుంది చెప్పండి? ఎవరి వ్యక్తిత్వ ధర్మం ఏమిటో దాన్ని అర్థం చేసు కోవటం ముఖ్యం కాదా ఆవ్యక్తి పురోగమనానికీ, పెరుగుదలకూ. ఈ దృష్టితో చూస్తే గాంధీగారు సృష్టించిన భ్రమ మనకెంత అనర్థదాయకంగా వుందో తెలుస్తుంది ! ఆయన హితోపదేశాలు నూటికి తొంభై మందికి పనికి వచ్చేవి కానే కావు. స్త్రీ పురుష సంబంధాన్ని గూర్చిగాని, సంతాన విషయంలో కాని, సౌందర్యా న్వేషణను గూర్చి గాని, గాంధీ వ్యక్తిగతంగా తనలో తను గుర్తించి నేర్చుకున్న విషయాలున్నాయే అవి లోకంలో మనుష్యులికి వాళ్ల మనోధర్మానికి సామాన్యంగా సరిపడేవి కావు అని నా గట్టి నమ్మకం. ఏమీ లేదు, ఒక్క సౌందర్యం విషయయంలోనే చూడండి. గాంధీ గారికి సౌందర్యం మీద దృష్టి పూజ్యం. సామా న్యుడికి వుండేటంతమేర అయినా సౌందర్యం మీద అభిరుచి ఆయనలో లేనట్లే కనిపిస్తుంది. ఆ అభిరుచే లేకపోవటంలో మనిషిలోని చిత్త వికారం, సౌందర్యా కాంక్ష సర్వమూ కామమే అనిపించి దాన్ని నిషేధించాడేమో ఆయన అనిపిస్తుంది..... మీరేమంటారు ఈ అభిప్రాయాలకు?"

చంద్రావతి మాటలు చర్చాధోరణిగా కాక, తీవ్రమైన సంఘర్షణా ఆవేదనా అనుభవించి గాంధీ ఆదర్శాల్ని తఱచి చూచిన వ్యక్తి అభిప్రాయాలుగా ధ్వనించటంతో ప్రతిగా శ్రీధర్ ఏమీ మాట్లాడలేక పోయాడు. ఆమెతో తీవ్రంగా వివాద పడాలనిపించ లేదతనికి.

"మీరు గాంధీ ఆదర్శాలని నిత్య జీవితంలో పరీక్షచేసుకునే వున్నారన్న మాట! లేకపోతే యింత నిశితంగా విమర్శించరు" అని మాత్రం అన్నాడు. ఒక వైపు తన సొంత ప్రయత్నాలు కూడా గుర్తుకు వచ్చాయి శ్రీధర్‌కు.

అతను ఉద్వేగం లేకుండా శాంతంగా జవాబు చెప్పడంతో చంద్రావతి తన తీవ్ర ధోరణికి ఒక్క క్షణం సిగ్గుపడి నట్లుగా కన్పించింది. కాని తక్షణమే అతని ముఖంలోకి చూచి నవ్వుతూ,

"జీవితానికీ ఆ సూత్రాలకీ అసలు లంకె కుదరందే పరీక్ష ఎట్లా సాగుతుందీ? చెప్పండి మీ సంగతి! మీరింతగా గాంధీ మతస్థులని చెప్పుకుంటున్నారే...."

"చెప్పటాని కేముంది! నేను సత్యం, ప్రేమ, అహింస అనే ఆదర్శాల విషయం నిత్య జీవితంలో ఎంత వరకూ సాధ్యం అని ఆలోచించానే కాని, మీరు చెప్పిన బ్రహ్మచర్యము, సౌందర్యము మొదలైన వాటి సంగతి నాకు తట్టనే లేదు! స్వభావంలో భేదాల్ని బట్టి గాంధీ గారి వైఖరికీ మిగతా వ్యక్తుల వైఖరికీ కొంత దూరం తప్పనిసరే కావచ్చు. కాని ఆధ్యాత్మిక అభివృద్ధి ఆయన చూపిన మార్గం నిర్దుష్టమనే అంగీకరించాలి!"

"ఆధ్యాత్మికాభివృద్ధికి మార్గాల్లో కూడా ఆయనది కేవలం ఆయన స్వభావానికి అనువైన ప్రత్యేక మార్గమేనని తోస్తుంది నాకు. మొన్న జరిగిన చర్చలో మీరు సూచించిన విషయమే తీసుకోండి. అదే మీతో నేను వాదించా లనుకున్నది

కూడా. ఒక వ్యక్తి తను చేసిన తప్పు బహిరంగంగా అంగీకరించి, శిక్ష అనుభవించాలి, అన్నారు మీరు! అదీ బహుశా ఒకరకం స్వభావం కల మనిషికే సరిపోతుంది కాని, అందరికీ సరిపోదు అంటాను. తప్పు చేసినప్పుడు ఒక వ్యక్తి దాన్ని తన ఆంతర్యంలోనే గుర్తించి తర్వాత అలాంటి దెప్పుడూ చెయ్యగూడదనే నిశ్చయానికి రావడం ఒకటీ, దాన్ని బహిరంగంగా అందరికీ చెప్పడం మరొకటీ. ఈ రెండూ ఒకటే నంటూ, ఒకటి కావాలంటూ కదూ మొన్న మీరు వాదించారు. నేను సుతరామూ అంగీకరించ లేదు ఆవాదన.. ఏమంటే ఆరెండూ భిన్నమైన విషయాలు. వ్యక్తికి ప్రత్యేకమైన రహస్యమైన ఏకాంతమైన ఒక భాగం తనలో తనదిగా వుండటం ముఖ్యం అని నాభావన. అక్కడ జరిగే దిద్దుబాట్లు, మార్పులు, పశ్చాత్తాపాలు, పరిణామాలు బహిరంగం చెయ్యడం వల్ల నష్టమే కాని లాభం వుండదు. ప్రతిదీ అలా బహిరంగం చెయ్యటానికి అలవాటు పడ్డ వ్యక్తి ఎప్పుడూ ఆధ్యాత్మికంగా అభివృద్ధి కాలేడనే నా నమ్మకం..."

"ఎందుకంటారు? గాంధీ గారి ఆధ్యాత్మికాభి వృద్ధికి ఆటంక మేమీ జరగలేదే! ముఖ్యంగా క్రైస్తవుల్లో కేథలిక్కుల్లో ఎప్పటి నుంచో వున్న సంప్రదాయమేనే అది! "

గాంధీ తన అంతర్యాన్ని కూడా పూర్తిగా ఎన్నడూ నడి బజార్లో పెట్టలేదనే నా నమ్మకం! అంతర్వాణి Innervoice) అంటూ ధ్యాన ముద్రలో మునిగి పోయి తర్వాత అక్కడి నుండి తెచ్చిన ఆణి ముత్యాలని మాత్రమే అందరి ముందూ పెట్టే వాడు ఆయన.. ఇక క్రైస్తవ సంప్రదాయ మంటారా, ఆత్మ శుద్ధి కోసం ఏర్పడినా దానికి ఆజన్మ పాపం (Originalsin) అనే విశ్వాసంతో తీరని సంబంధం వుండటంవల్ల, ఆ భారాన్ని మోస్తూ అది ఆత్మ శుద్ధికి దోహదం కావటం లేదు, అని నాకు తెలిసి నంత వరకు అనిపిస్తుంది... అంతే కాదు, విచిత్ర మేమి టంటే— కొందరి విషయంలో వాళ్ళు చెయ్యని పాపాల్ని కూడా చెప్పించి అదేఒక గొప్ప ఆధ్యాత్మికసాధన అనేట్లుతయారవుతుంది ఆపద్ధతి! నాకు మేరీ అనే స్నేహితురాలుండేది కాన్వెంటు స్కూల్లో చదువుకునేప్పుడు. తర్వాత ఆమె సిస్టర్‌గా సన్యాసం పుచ్చుకున్నది. ఆమెలో ఈ గుణమే ఎప్పుడూ కనిపించేది. ఆమెకు ప్రతి విషయం లోనూ ఏదో పాపాన్ని చూచే నేర్పు వుండేది! "

శ్రీధర్ నవ్వాడు. "మీరు చాలా విషయాలు చాల దూరమే ఆలోచించారని తెలుస్తోంది. నిజానికి నేనెప్పుడూ ఇంత దూరం వెళ్ళలే దనుకోండి. కనీసం సంఘ ధర్మ నిర్వహణలో నైనా చేసిన తప్పులు బహిరంగంగా అంగీకరించే ధైర్యం వుండాలి అని మీరూ ఒప్పుకుంటారు. సంఘంలో లీనం కాకుండా ప్రత్యేకంగా అతీతంగా వుండే భాగం వ్యక్తిత్వంలో ప్రధానమైన దన్నవిషయం నేనూ అంగీకరిస్తాను. ఇక మనకు వివాదమే లేదు... ఏమైనా మీరింత స్నేహపూర్వకంగా మీయింటికి పిలిచి నందుకు థాంక్స్" అంటూ సెలవు తీసుకోవటానికి ఉద్యుక్తుడయ్యాడు శ్రీధర్.

"నేనేదో ఆధ్యాత్మిక వాదిననీ, ఒక మహత్తరమైన గంభీరమైన ఆదర్శంతో బ్రతుకు తున్నాననీ అపార్థం చేసు కోకండి శ్రీధర్ గారూ! అంత కంటే ట్రాజెడీ వుండదు— జీవితం సంతృప్తిగా సరదాగా గడచి పోతే చాలు అనే ఆదర్శమే నాది!..." అన్నది చంద్రావతి.

"మీకు సినిమాలంటే చాల యిష్టం కాబోలు"

"అవును. మీకూ అంతేనా? "

ఇద్దరూ నవ్వారు.

కాంపౌండు గేటు దాకా వచ్చింది చంద్రావతి. బస్సుస్టాప్ కెలా వెళ్ళాలో, ఏనంబరు బస్సులో ఎక్కి ఎక్కడ దిగాలో వివరాలు చెప్పి సెలవు తీసుకున్నది.

ఒక గంటన్నర కాలమే అయినా ఏదో క్రొత్త లోకంలో గడిపి వచ్చి నట్లనిపించింది శ్రీధర్‌కు. తన కిష్టమైన విషయాల్ని గూర్చి ఇలా చక్కగా విమర్శిస్తూ చర్చించే వ్యక్తి—స్త్రీ— యింత వరకు ఎదురవ లేదు. తార ఎందుకని యిలా మాట్లాడదు? ఎంత సేపూ ఏదో కక్ష సాధిస్తున్నట్లో లేక భార్యగా తన అధికా రాన్ని చలాయిస్తూ ఒత్తిడి పెడుతున్నట్లో మాత్రమే మాట్లాడు తుంది తార. చంద్రావతి భర్త ఎంత అదృష్టవంతుడో!......

ఆ రాత్రీ మరునటి రోజూకూడా చంద్రావతి కంఠస్వరమూ, ఆమె మాటలూ, ఆలోచనా వైఖరీ మెరుపుల్లా మెరుస్తూనే వున్నాయి శ్రీధర్ పథంలో.

తర్వాత ఆమె కాలేజిలో కనిపించినా, ఆమెతో మాట్లా డేందుకు అవకాశమే లభించలేదు శ్రీధర్‌కు. ఆమె కూడా కళ్ళ తోనే పలకరించి తన మామూలు ధోరణిలో వెళ్లి పోయింది. పది రోజులు గడిచాయి. చంద్రావతితో మళ్లీ మాట్లాడటానికి శ్రీధర్ తహ తహ పడుతూనే వున్నాడు. రెండుసార్లు లెక్చరరు లేక పోవడంతో క్లాసు మధ్య తీరిక వచ్చింది. శ్రీధర్ లైబ్రరీకి వెళ్లాడు చంద్రావతి అక్కడికి వస్తుందనే ఆశా భావంతో. కాని ఆమె రాలేదు.

చంద్రావతితో మాట్లాడ దలచుకుంటే ఆమెయింటికి ఏ సాయంత్రమో తనే స్వయంగా వెళ్ల వచ్చు. లేదా కాలేజి ముగియగానే సాయంత్రం ఆమె కారు వచ్చేటప్పటికి తనూ అక్కడికి వెళ్లినా చాలు. ఆమె తప్ప కుండా పలకరిస్తుంది, ఆహ్వానిస్తుంది...కాని యీ రెండు విధాలా స్వయంగా ఆమె కోసం వెళ్లటం శ్రీధర్‌కు మనస్కరించలేదు. అందులో తన ప్రయత్నం, ఆసక్తి కనిపించటం అతనికి బొత్తిగా యిష్టం లేదు. తను ఆమె వెంట పడుతున్నాడని ఆమె అనుకుంటుం దేమోనన్న అనుమానం ఒక వైపు.

తర్వాత ఒక వారం రోజులు చంద్రావతి కాలేజీకి రాలేదు. ఆమె కాలేజీ మానివేసిందేమో నన్న అనుమానం కూడా కలిగింది. ఇక చంద్రావతితో మాట్లాడే అవకాశం గాని ఆమెతో స్నేహం అభివృద్ధి అయ్యే మార్గంగాని లేనే లేదా? అన్న ఒక నిస్పృహ వేధిస్తోంది శ్రీధర్‌ని.

చివరకు ధైర్యం చేసి ఆదివారం రాగానే చంద్రావ- యింటికి వెళ్లాడు సాయంత్రం అయిదు గంటలకు......"

తోటమాలి యింటి క్రింద భాగంలో వున్న ఆఫీసుగదిలో అతణ్ణి కూర్చోబెట్టి లోపలికి వెళ్ళాడు. చంద్రావతి ఆరోజే వూరి నుంచీ వచ్చి నట్లు తోటమాలి చెప్పటంతో, ఆమె వూరికి వెళ్లటం వల్లే కాలేజికి రాలేదని అర్థమయింది. ఇంతలో తొందర పడి, తనే కల్పించుకొని ఆమెయింటికి రావటం బాగులేదేమో అనిపించింది... కాని ఒకసారి పరిచయమైన తర్వాత వచ్చి పలక రించటంలో అసహజత్వం ఏమీ లేదు కదా అనిపించింది మళ్లీ....

"హల్లో.. మీరా! ఏమిటండీ కాలేజీ విశేషాలు?" అంటూ చంద్రావతి ఆఫీసరులా ఆమె భర్తకూర్చునే కుర్చీలో కూర్చున్నది.

అగది తీరూ, ఆమె తనూ కూర్చున్న స్థానాలను బట్టీ ఒక్కక్షణం తనేదో ఆఫీసరుతో ఇంటర్వ్యూకి వచ్చి నట్లనిపించింది శ్రీధర్‌కు...

"విశేషా లేమీ లేవండీ! మీరు కాలేజీకి రాలేదు, చదువు మానేశారేమో ననిపించింది. కనుక్కుందామని వచ్చాను...." ఆమె రాకపోవటాన్ని గూర్చి లోపలివూహ ఎలా వున్నా ఆవిషయం ఆమెతో చెప్పదలచుకోలేదు శ్రీధర్; కాని అనుకోకుండా ఆమాటే వూడిపడింది నోరు విప్పగానే!

ఎందుకు వచ్చింది మీకా వూహ? మీరట్లా అనుకోవటం తమాషాగా వుందే! చెప్పండి ఎందుకలా అనుకున్నారో!"

"ఏమో వూరికే అనిపించింది. మరి ఎవరి విషయంలో నైనా సంసార బాధ్యతలూ అవీ వున్నపుడు పరిస్థితి ఎలా మారుతూ వుంటుందో ఎవరు చెప్పగలరు?... నాసంగతే చూడండి, మా అన్నయ్యకు నేను బి.టి.లో చేరటం యిష్టంలేదు. మా మావయ్య ప్రోత్సాహమిచ్చి పంపించాడు. వచ్చి కాలేజీలో చేరేదాకా నమ్మకమే లేదు!" అంటూ స్వవిషయంలో పడ్డాడు.

అప్పుడు చంద్రావతి చెప్పింది: నిజంగానే తనకు చదువు మానెయ్యాలనే వూహ ఈవారం రోజుల్లో కలిగినట్లూ, చివరకు అలా కాకుండా చదువు సాగించటానికే నిశ్చయించు కున్నట్లూ! సంభాషణ వాళ్ల వాళ్ల కుటుంబాల స్థితి గతుల మీద నడిచింది. శ్రీధర్ తన యింటి సంగతి చెప్పాడు. చంద్రావతి కొడుక్కి నాలుగేళ్ల వయస్సు. అమ్మమ్మ దగ్గర పెరుగుతూ వున్నాడట. ఒక అక్కయ్య తప్ప అన్నదమ్ములు లేరట. ఆఅక్కయ్యకు ఆడపిల్లలే సంతానం కావటంతో చంద్రావతి తల్లికి మనుమడి మీద మమకారం. వాడామె దగ్గరే వుంటున్నాడు. ఈమధ్య వాడికి జబ్బు చేస్తే చంద్రావతిని రమ్మని ఉత్తరం వచ్చిందట. అందు వల్ల కాలేజికి సెలవు పెట్టి వెళ్లింది.

"వాణ్ణి నాతో తీసుకు వద్దామని ప్రయత్నం చేశాను. కాని వాడికి వచ్చే యిష్టంలేదు.... అసలు నన్ను మరచేపోయాడు కూడా... ఇక్కడ నేను కాలేజికి వెళ్లేయిబ్బంది వున్నాసరే, వాడు నన్ను మరచి పోతే ఎలాగ అని మథనపడి, ఆవుద్దేశంతో తీసుకు వచ్చేయాలనుకున్నాను. కాని మళ్లీ అనిపించింది: వాడు నాదగ్గర బెంగ పెట్టుకుని అన్‌హాపీగా దిగులుగా వుండేకంటే అక్కడే వుండటం మేలు కదా! కొంత బుద్ధితెలిసి స్కూలుకి వెళ్లే వయస్సుదాకా అక్కడ వుండాలిసిందే."

"మీవారు అబ్బాయి యిక్కడ వుండాలని అభిప్రాయ పడటం లేదా?" అని ప్రశ్నించాడు శ్రీధర్.

"అబ్బే వారికి తీరి కెక్కడిది? ఆయనకు యిరవై నాల్గుగంటలూ పనే..." అని చంద్రావతి వూరుకున్నది. ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా అంతలోనే లేచి లోపలికి వెళ్లింది...

పదిహేను యిరువై నిముషాల తర్వాత గాని ఆమె మళ్లీ తిరిగి రాలేదు. అప్పటికి డ్రెస్సుమార్చుకుని బయటికి వెళ్లే సన్నా హంలో తయారై వచ్చింది.

"పదండి అలా వెళ్దాం.. ప్రొద్దున ఏడింటికి వూరినుంచి వచ్చాను. అప్పటి నుంచి ఏమీ తోచలేదు మాబాబుని గూర్చి ఆలో చిస్తూనే వున్నాను రోజంతా... మనస్సులో ఎట్లానోవుంది. మీరు రావటం మంచిదైంది..."

ఇద్దరూ బస్‌స్టాప్ వైపు నడిచారు.

చంద్రావతి భర్త వూళ్లోలేరట. క్రింది రోజే టూర్ వెళ్లారట. ఆయనకు వాళ్ల కంపెనీ గొడవలు పట్టినంతగా యింటి గొడవలు పట్టవట. ఇంట్లో వంటలక్క, అయ్యరు కుర్రవాడు, తోటమాలి తప్ప స్వజనం ఎవ్వరూ లేరు. ఎప్పుడైనా చంద్రావతి అత్తగారో బావగారో మరదులో బంధువులో వచ్చి వెళ్తూవుంటారట...

చంద్రావతి "ఏదైనా సినిమాకు వెళ్దాం శ్రీధర్"అన్నది.

కేసినో థియేటరుకు చేరుకునేటప్పటికి ఏడు గంటలు కావస్తోంది. సినిమా ప్రారంభించి అర గంట అయింది. కాని అసలు చిత్రం అప్పుడే ప్రారంభం అవుతోంది.

చీకట్లో శ్రీధర్ చంద్రావతిని చేయి పట్టుకుని తీసు కెళ్ల వలసి వచ్చింది. ఇంగ్లీషు చిత్రం పేరు "ధూళిలో పూలు" (Blossoms in the Dust). అవివాహితలైన స్త్రీలకు కలిగే అక్రమ సంతానాన్ని గూర్చి సాంఘిక దురన్యాయాన్ని ఖండిస్తూ తీసిన చిత్రం అది. ఒక అరగంట చూశాక చంద్రావతి "శ్రీధర్, నాకు తలనొప్పిగా వుంది, వెళ్లి పోదామా?" అన్నది.

"సరే" నన్నాడు శ్రీధర్.

థియేటరు బయటికి రాగానే టాక్సీ పిలిచి చంద్రావతి మెరీనా బీచ్‌కి తీసుకు వెళ్లమని డ్రైవరుతో చెప్పింది. శ్రీధర్ కామె ప్రవర్తనల వల్ల ఆమె ఏదో మనోవ్యథతో బాధ పడు తున్నట్లు అనుమానం కలిగింది. బహుశా కొడుకు ఆరోగ్యవిషయం కావచ్చు ననుకున్నాడు. ఆవిషయమై సూటిగా ఆమెను ప్రశ్నిం చడం యిష్టం లేక మౌనం వహించాడు.

టాక్సీ దిగి ఇసుకలో నడచి వెళ్లి అలలకు సమీపంలో కూర్చున్నారు. అప్పటికే బీచ్‌లో జనం పల్చబడి పోయారు. వెన్నెల మసగ్గావుంది.

"శ్రీధర్! సముద్రాన్ని చూస్తుంటే నీకే మనిపిస్తుంది?"

శ్రీధర్ ఆమె ముఖంలోకి పరీక్షగా చూశాడు. ఆమె మనస్సు తీరు తనకేమీ అర్థం కాక పోవటంతో ముఖ కవళికల్ని

ఏమైనా గ్రహించ వచ్చునేమో అన్నట్లు. కాని ఆ మసక చీకట్లో ఆమె కళ్లద్దాల మీద ప్రతి ఫలించే సన్నని వెలుగు సృష్టించిన ఒక ఛాయారూపం తప్ప అతని కేమీ స్పష్టంగా కనిపించ లేదు.....

"ఏమీ అనిపించదా?" మళ్లీ ప్రశ్నించింది చంద్రావతి.

"ఎప్పు డిక్కడికి వచ్చి కూర్చున్నా నాకు ఒకటే భావన కలిగేది. జీవితమూ అనుభవమూ అనంతం.. ఇందులో నేనూ నాకు చెందినదీ ఒక్క పరమాణువే కదా అని. దానిలో ఏమిటో ఆవేదన.. కాని ఇప్పుడలా ఏమీ అనిపించటం లేదు, అందుకే ఆలోచిస్తూ వూరుకున్నాను."

"నా కే మనిపిస్తోందో చెప్పేదా? ఈ అలలన్నీ ఆశలు ఆదర్శాలూ అనుకుంటే ఇవి తీరాన్ని తాకి చెదిరి పోవటం, మళ్లీ వెనక్కి అదృశ్యమై పోవటం, యింత కంటే వీటికి అర్థమేమీ లేదు అని... జీవితం యిసుక దిబ్బ..."

శ్రీధర్‌కు వాదించాలనీ చర్చించాలనీ లేదు. మాట్లాడకుండా చీకట్లోకి చూస్తూ కూర్చోవాలని వుంది....

"జీవితంలో అన్నిటి కంటే భరింపరాని విషయ మేమిటో తెలుసా?.." ఆమె ఆగింది, కాని శ్రీధర్ నుంచి ప్రత్యుత్తరం లేదు.. "మనం కోరిన అదృష్టం చేతిలోకి వచ్చినట్లే వచ్చి, తీరా చూస్తే అది మనకు కాకుండా పోవటం.. కారణం లేకుండానే అలా జరగటం.. మా అమ్మమ్మ అంటూ వుండేది 'లక్ష్మి చంచల' అని.. చాల నాళ్లు నా కా వేదాంతం వెఱ్ఱితనంగా ఆలోచనా శూన్యతగా కనుపించేది... అసమర్థత, అజాగ్రత్త వంటి కారణాల వల్లే, బాధ్యత నిర్వర్తించక పోవటం మూలాన్నే లక్ష్మి మాయమై పోతుంది, అంటే ధనం ఐశ్వర్యం హరించుకుపోతుంది అనిపించేది. అదీ నిజమే కాని లక్ష్మి అంటే కేవలం డబ్బుకాదు, ఆస్తిపాస్తులూ కావు, లక్ష్మి అంటే ముఖ్యంగా అదృష్టం— మనకేది ఆనందాన్ని ఇస్తుందో దాని స్వరూపం. అదివుంటే సంపదవున్నా లేకపోయినా ఒకటే.. కాని అది మన ప్రయత్నం మీద ఆధార పడదు. కారణం లేకుండానే చెయ్యి జారి పోతుంది.!...నిజంగా లక్ష్మి చంచల!..."

శ్రీధర్‌కు చంద్రావతి మనోవ్యధ ఏమిటో అర్థం కావటం లేదు...

"నీ అభిప్రాయ మేమిటి శ్రీధర్? నువ్వేమీ పలకటం లేదే!"

"మీరు చెప్పేది ఒక రకంగా నాకూ అనుభవమే... జీవితం సవ్యంగా ఎందుకు నడవదో అని ఆలోచిస్తూ వుంటాను. అదే నాకూ అర్థంకాదు... కాని మీ అదృష్టానికి వచ్చిన లోపం ఏమిటీ?"

"నేను అంత దూరంలో వున్నానా శ్రీధర్? 'నువ్వు' అని పిలవటానికే సందేహంగావుంది మీకు!... ఇక నా అదృష్టానికి వచ్చిన లోపం ఏమిటో ఎందుకు చెప్పాలి మీకు? పదండి వెళ్దాం" అన్నది చంద్రావతి. ఆమె తటాలున లేచి నిల్చున్నది వెళ్లడాని కుద్యుక్తురాలౌతూ.

శ్రీధర్ కూడా లేవక తప్ప లేదు. ఆమెలో అకస్మాత్తుగా వచ్చిన యీ మార్పుకి అతను చకితుడయ్యాడు.

తనకెదురై తన హృదయాన్ని అన్వేషిస్తూ వచ్చిన ఒక సౌందర్య తరంగం ఒక అనుభూతి మాధుర్యం, జీవన తీరాన్ని ఒఱసి అంతలోనే వెనక్కి జారిపోతూ పారి పోతూ వున్నట్లు తను నిలుచున్న చోటికే వచ్చి తన్ను ముంచెత్తుతుం దనుకున్న పెద్ద అల అకారణంగా సముద్రంలోకి వెనక్కి వెళ్లి పోతూ వున్నట్లు, యిసుకలో నిలబడ్డ శ్రీధర్ హృదయం బాధతో కుంచించుకు పోయింది.

ఆమె వెంట నడుస్తూ శ్రీధర్ తన ఆవేదనను వ్యక్తం చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు...

"నేను మనస్సులో మిమ్మల్ని గూర్చి ఏమనుకుంటున్నానో మీకెలా తెలుస్తుంది.? మీకంటే దగ్గరగా వచ్చిన వ్యక్తి నా జీవితంలో ఎవ్వరూ లేరే!... ఆ సాయంత్రం మీతోమాట్లాడిన తర్వాత ఈ యిరవై రోజులూ మిమ్మల్ని గూర్చే ఆలోచించాను. మీ మాటలే జ్ఞాపకం వస్తున్నయి రాత్రీ పగలూ.. నాకు చెప్పటం చేతకాదు.. ఒక్క విషయంలో నేను చాల దురదృష్టవంతుణ్ణి. ఎందుకో నన్నందరూ అపార్థమే చేసుకుంటారు. నా భార్య తార విషయం మీకు పూర్తిగా చెప్పలేదు. ఆమెకెప్పుడూ నామీద కక్ష సాధించాలనే వుంటుంది... ఎప్పుడు నామనస్సు వికసిస్తుందో అప్పుడే ఆమె తిరస్కరిస్తుంది.. ఆమె సుఖంగా వుండే క్షణాల్లో నాకు భయం వేస్తుంది. నాకో స్నేహితుడుండే వాడు.. జీవితాన్నిగూర్చీ ఆదర్శాలనుగూర్చీ మేము మాట్లాడుకొని విసయాలే లేవు. అంతగా సన్నిహితులం కొన్నిసంవత్సరాలపాటు. కాని తీరాచూస్తే అతని మార్గమే వేరు. అతను నాకర్థమే కాలే దనిపించింది. అతనూ నేనూ విడిపోవాల్సి వచ్చింది. ఎక్కడా స్నేహాన్ని రక్షించుకోలేని యీ నా దురదృష్టానికి నే నేమనుకోవాలి? ఈ సాయంత్రం మీయింట్లో మాట్లాడినంతసేపూ, ఈ క్షణందాకా నేనెంతో అదృష్టవంతుణ్ణో! కాని యింతలో మీకెందుకు కోపం వచ్చింది? మీరేదో మనోవ్యధతో బాధపడుతూ నన్ను అపార్థం చేసుకుంటున్నారు. మిమ్మల్ని 'నువ్వు' అనకపోవటం ఒక కారణమా? మీ కదే యిష్టమైతే అలానే అంటాను.. కాని యీ స్నేహబంధాన్ని త్రెంచి వెయ్యకండి.. నాకు మిగిలింది యిది ఒక్కటే.. కనీసం నా తప్పేమిటో నాకు చెప్పండి..."

శ్రీధర్ మాట్లాడుతూవుంటే చంద్రావతి ఒక్క మాటైనా చెప్పకుండా నడుస్తోంది. శ్రీధర్ ముగించాడు. అప్పటికీ ఆమె మౌనంగానే వుంది. రోడ్డు చేరుకుని దీపాల వెలుగులోకి ప్రవేశించారు యిద్దరూ. ఆగి వెల్తురులో ఒకరి వైపొకరు చూచుకున్నారు.

చంద్రావతి కళ్లద్దాలు తీసి చేతి రుమాలుతో కళ్ళూ ముఖం అద్దుకుని మళ్లీ అద్దాలు ధరించి యిటూ అటూ చూచి "టాక్సీలు దొరకవు కాబోలు యిక్కడ" అన్నది.

"లేదు.. బస్‌స్టాప్ దగ్గరే" అన్నాడు శ్రీధర్ దారి తీస్తూ.

చంద్రావతి అతని దగ్గరగా వచ్చి "ఇద్దరమూ భలే సెంటిమెంటల్ క్రీచర్స్మి దొరికాం కదూ! దీన్నిగూర్చి యిక మనం తర్కించవద్దు" అన్నది.

శ్రీధర్ ఆమె ముఖంలోకి చూచాడు. ఆమె నవ్వింది.

బస్‌స్టాప్ చేరుకునేంతలో ఒక ఖాళీ టాక్సీ ఎదురైంది. చంద్రావతే దాన్ని పిలిచి ఆపుచేసింది. ఇద్దరూ టాక్సీలో కూర్చున్నారు.

"నిజంగానే యివ్వాళ నామనస్సేమీ బాగులేదు శ్రీధర్.. ఇంకోసారి ఎప్పుడైనా చెబుతాను కారణ మేమిటో" అన్నది చంద్రావతి.

శ్రీధర్ మనస్సులో బరువు తీసినట్లైంది. తర్వాత యిద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండి పోయారు.

టాక్సీ చంద్రావతి యింటి కాంపౌండ్‌లో ప్రవేశించి ఆగింది. టైము 8.45 అయింది. శ్రీధర్ దిగబోతూవుంటే చంద్రావతి "ఈ టాక్సీలోనే వెళ్ళొచ్చుగా హాస్టలుకి" అన్నది.

"నేను పర్సు తీసుకురాలేదు" అన్నాడు శ్రీధర్.

"ఓహ్, ఇదుగో నాపర్సు" అంటూ పెద్ద పర్సులాంటి తన వానిటీబాగ్‌ని అతనిమీద పడవేసి, టాక్సీ తలుపుమూసి, చంద్రావతి గబగబా మెట్లెక్కి యింట్లోకి వెళ్ళిపోయింది.

## 10

శ్రీధర్ చంద్రావతి బ్యాగ్ తెరచి చూచాడు.

నల్లటి పర్సులోపల లేత గులాబీరంగు సిల్కు లైనింగ్. అందులో ఒక చిన్నదువ్వెన, అద్దం, చేతిరుమాలూ, ఇరవై రెండు రూపాయల మూడణాలూ ఉన్నాయి.

బ్యాగ్‌లోనుంచీ గుప్పుమన్న మొగలిపువ్వు పరిమళం అతన్ని ఆకర్షించింది. అడుగున వాడిన సన్నని మొగలిరేకు చీలిక కూడా కనిపించింది. కృత్రిమమైన అత్తరువాసన కాదన్న మాట!

గదికి వెళ్ళాక కూడా శ్రీధర్ చంద్రావతిని గూర్చే ఆలోచిస్తున్నాడు.. ఆమెకోరిన సానుభూతి ఏదో తను యివ్వలేక పోయాడు. స్నేహబంధాన్ని త్రెంచివేసే ఉద్దేశం ఆమెకు లేక పోయినా, ఆమె మనస్సుకి సాంత్వనం కలిగించలేక పోవటమే స్నేహంలో ఆమె పొందిన ఆశాభంగానికి కారణమైంది అని తోచింది.

అయితే ఆమె కోరిన సానుభూతి స్వరూప మేమిటో! ఆమె సమస్య ఎటువంటిదో, ఆ చేయిజారిన అదృష్టం—'లక్ష్మి'—ఏమిటో ఆమె చెప్పనిదే ఎలా తెలుస్తుంది? కాని అలా సూటిగా అడగటమే తప్పుగా పరిణమించిందే!

పోతే, ఆమె 'యిద్దరమూ సెంటిమెంటల్ క్రీచర్స్మే' అని వ్యాఖ్యానించటంలోనూ అర్థం కనిపించలేదు!

వ్యక్తుల మధ్య స్నేహానుబంధం ఎంత సున్నితమైనదో దాని విలువ తనకు తెలుసు. కాని దాన్ని రక్షించుకోవట మెలాగో యింతవరకూ తెలీకుండా వుంది. దాన్ని గూర్చిన జ్ఞానం ఏ పుస్తకాలు ఏ సూత్రాలు మాత్రం ప్రసాదించగలవు?

కాలేజీకి వెళ్తూ ఆమె బ్యాగ్ తనతో తీసుకువెళ్ళలేదు.

ఆమె చేతిలో ఎర్రటి బ్యాగ్‌నొకదాన్ని చూశాడు.

ఆ సాయంత్రమే ఆమె బ్యాగ్ తిరిగి యివ్వటానికి యింటికి వెళ్ళాడు. అతణ్ణి మేడ మీదికి తీసుకువెళ్ళి కూర్చోబెట్టింది చంద్రావతి.

"దీన్ని కాలేజీకి తీసుకురాలేదేం?" అని ప్రశ్నించింది.

"ఇదొక్కటేనా, చంద్రావతికి చాలా పర్సులున్నాయని తెలిసే తీసుకురాలేదు".

"నా పర్సులన్నీ చూచినట్లే మాట్లాడుతున్నావే! ఎప్పుడు చూశావేమిటీ?.. అదికాదులే కారణం. కాలేజీలో స్నేహితులు చూసి నవ్వుతారనీ, ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తారనే భయం.. అవునా?"

"నాకేం భయంలేదు."

"నీకు ఎవరంటేనూ భయంలేదా?"

"లేదు"

"భార్య తారాదేవి గారంటేనూ?"

శ్రీధర్ ముఖ కవళిక మారింది.

"లేదు" అన్నాడు.

"ఆమె సుముఖంగా వుండే క్షణాల్లో కూడా భయం వెయ్యదూ?"

"రాత్రి ఏం చెప్పావో ఆనంగతి యిలా ప్రశ్నిస్తే యేం జెయ్యనూ?".

"అయితే రాత్రి చెప్పింది అబద్ధమా? రాత్రి ఒకటీ పగ లొకటీ చెప్పటం అలవాటు కాబోలు, మగవాళ్ళందరికీ..."

శ్రీధర్ చీకాకుపడుతూ "ఈ ధోరణిలో మాట్లాడితే ఇవాళ్టికి నేను సెలవు తీసుకుంటాను" అన్నాడు.

"సరే ధోరణిలో మాట్లాడితే అర్థం అవుతుందీ?" చంద్రావతి సీరియస్‌గా చెప్పటం ప్రారంభించింది: "చూడు శ్రీధర్, మనం జీవితాన్ని ఏదో గంభీరమైన, మహత్తరమైన విషయంగా భావించి భయపడటంవల్లే జీవితం మనల్ని ఏడిపిస్తుంది... దాన్తో చిన్నవిషయాలు, సామాన్యులికి అర్థం అయ్యేవీ మనకు అర్థంకావు. సిద్ధాంతాలు సూత్రాలు, ఆదర్శాలు ఆశయాలు, ప్రతిక్షణమూ దృష్టికి అడ్డుతగులుతూ వుంటాయి.... నిన్న బీచ్ నుంచి వచ్చాక నాకనిపించింది: సామాన్యులైన స్త్రీ పురుషులు యిద్దరు ఎంత సులువుగా ఒకరినొకరు అర్థం చేసుకుంటారు! కాని పుస్తకాలు చదువుకొని దాని ఫలితంగా సెంటిమెంట్స్‌ని గట్టిగా కౌగలించుకుని కూర్చున్న మనవంటివాళ్లకు జీవితం ఒక అందుకోలేని స్వప్నమో, లేకపోతే ఒక విషాదగాథగానో తయారవుతుంది! కారణం మనకు మామూలు మనుష్యులే అర్థంకారు!.. ఏ వ్యక్తీ కూడా తన ఆంతర్యమేమిటో సూచిం

చటం తప్ప వివరించి చెప్పటానికి వీల్లేదు శ్రీధర్! దాన్ని మరో వ్యక్తి సూక్ష్మంగా గ్రహించటంలోనే మనస్సుల మధ్య ఐక్యం, ప్రేమ, స్నేహం సాధ్యం... ఇది మరీ ముఖ్యం స్త్రీపురుషుల మధ్య.. రాత్రి నువ్వుపడ్డ ఆవేదనలాంటిదే నా మనస్సులోనూ వుందనుకో, కాని దాన్ని అలా చెప్పుకోవటమే సెంటిమెంటలిజమ్, బలహీనత; దానివల్ల ఏమీ లాభించదు..."

"కాని నేను హృదయం విప్పి చెప్పుకోవటం వల్ల మేలే జరిగింది కదా?"

"ఏమిటీ జరిగిన మేలు! నే నొక సెంటిమెంటలిస్టునైతే నువ్వు నాకంటె కూడా ఎంత అమాయకుడివో వ్యక్తం చేసుకున్నావు.. నా క్కోపం వచ్చిందే అనుకో, వస్తే నువ్వెందుకు భయపడాలి! అంతలో స్నేహబంధం తెగిపోతుందని ఎందు కనుకోవాలి? స్నేహంకోసం అలా అమాయకంగా యాచిస్తే మాత్రం స్నేహం లభిస్తుందా? నిలుస్తుందా? జీవితం ముందు యీ యాచ్నాభావం ఎందుకంట!.. ఈ విమర్శ అంతా నా స్వభావానికీ అన్వయిస్తుంది. నేను అనుభవంమీద గుర్తించిన విషయమే చెబుతున్నాను శ్రీధర్— కాని నాకంటె నీ విషయంలో మరీను.. మనస్నేహం నిలవటానికి కారణం నువ్వు యాచించటమూ కాదు, నా స్వయం నిర్ణయమూకాదు, మనిద్దరమూ ఒకే స్థితిలో వుండటం శ్రీధర్! ఆ స్థితి ఏమిటో అర్థం చేసుకోవాలి, చెబితే తెలిసేది కాదు!.. పోనిద్దూ యిలా తర్కిస్తే మళ్లీ ఎక్కడికో తేలిపోతూ అయోమయంలో పడిపోతాం; అందుకే మనం యిలా తర్కించవద్దు.. ఎక్కడికైనా వెడదామా?"

"వద్దు.. నువ్వింకా యిలానే మాట్లాడుతూంటే వినాలనివుంది. రాత్రి నాకూ చూచాయగా తోచింది ఈ విషయమే— జీవితానికి పుస్తకాలజ్ఞానం ఒకవిధంగా పనికిరాదు అని— కాని నువ్వు విమర్శించినంతగా విమర్శించలేదు!"

"కబుర్లమీదా జీవితాన్ని గూర్చిన వ్యాఖ్యానంమీదా వున్న ఆకాంక్ష మనకు జీవించటంలో లేదే ఏమిటంట?"

"అయితే ఏం చెయ్యాలి?"

"బాగుంది ప్రశ్న!"

చంద్రావతి నిస్పృహగా పెదవి విరిచి ఒకపెద్ద నిట్టూర్పు విడిచింది. లేచి నిల్చుని "ఏదీ నీ చెయ్యి యిలాతే!" అన్నది.

"సాముద్రికం చెబుతావా ఏమిటి?" అంటూ శ్రీధర్ అరచెయ్యి ఆమెవైపు చాచాడు.

"కాదు! నువ్వు కూరుకుపోయిన ఊబిలోనుంచి నిన్నెలా లాగేది బాబూ!" అంటూ చంద్రావతి అతని చెయ్యి పట్టుకుని గట్టిగా పైకిలాగి "లే మరి" అన్నది.

శ్రీధర్ నవ్వుతూ లేచి నిల్చున్నాడు. ఆమె వున్నట్లుండి అలా చెయ్యటం ఎంతో రమణీయంగా వుండి అతణ్ణి ముగ్ధుణ్ణి చేసింది.. కాని ఆమె స్పర్శతో అతని శరీరం జలదరించింది.. అతని మనస్సున కామె వ్యక్తిత్వం ఒక నూత్న స్వరూపంతో, ఊహించని చైతన్య సౌందర్యంతో, స్నిగ్ధమైన హార్దతతో, మెరుపులా వెలిగి వెన్నెలలా అనుభవ గోచరమైంది.. అతని శరీరంలో నాగ స్వరం విన్న త్రాచులా ఒక చిత్త వికారం పడగ విప్పింది.. ఒకవైపు ఆమె ఆరాధ్యదేవతగా మార్గదర్శినిగా అతని భావనలో నిలిచింది. ఇంకొకవైపు వెన్నెలలో పాముని చూచినవాడికిమల్లె పారిపోదామనే అధైర్యమూ తోచింది అతనిలో... తనలో రేకెత్తిన చాంచల్యానికి సిగ్గూ కలిగింది...

"అక్కడ బాల్కనీలో కూర్చుందాం శ్రీధర్! నే నడిగిన ప్రశ్నలకు సమాధాన మివ్వటం నీవంతు.. తర్వాత చెబుతాను నువ్వు ఏం చేయాలో!"

"అలాగే గురువు గారూ!"

"నేను మగవాణ్ని కాదుగా"

"సరే, గుర్విణిగారూ.. కాని ఆ పదం అర్థం వేరేమో!"

"ఏమీవద్దు! 'చంద్రావతి' లేదా 'చంద్రా' అని పిలవచ్చు".

తోటమాలిని పిలిచి పేముకుర్చీలు రెండు బాల్కనీలో వేయించింది చంద్రావతి.

"నాకు ముందు తారను గూర్చి చెప్పు.. తార ఎలావుంటుంది? ఆమె ఎందుకని నిన్ను అపార్థం చేసుకుంటుంది?"

శ్రీధర్ తనపెళ్లి జరిగినతీరూ, తర్వాత తన ఉద్యోగం విషయం, దాన్ని గూర్చి అత్తవారి ఆశయాలూ, అవి భగ్నం కావటంతో వాళ్ల ఈసడింపూ, తార ప్రసవించటమూ, ప్రస్తుతం తన కుటుంబపు ఆర్థిక పరిస్థితీ ఒక కథగా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు.

చంద్రావతి సావధానంగా విన్నది.

"నువ్వనుకునేదానిలో కొంత నిజం లేకపోలేదు.. తల్లిదండ్రుల వైఖరి ననుసరించి ఆమెలో కొంత అసంతృప్తి కలిగి వుండవచ్చు. కాని అదేమంత ముఖ్యం కాదు.. ఆమెకు నీమీద సంపూర్ణమైన విశ్వాసం కుదరాలి, అప్పుడు పరిస్థితి నువ్వు కోరినట్లుగా మారుతుంది.. ఆమె ప్రసవించినప్పుడు ఆస్పత్రిలో మాట్లాడినతీరుగాని, తర్వాత మదనపల్లి వచ్చినపుడు ప్రవర్తించిన ధోరణి కాని చూస్తే, అందులో నువ్వనుకునే కక్ష సాధించటం, అధికారం చలాయించటం లేనేలేవు.. శ్రీధర్! మనం వ్యక్తుల్ని అర్థం చేసుకోటానికి ప్రయత్నించాలి కాని వారిమాటల్ని కాదు.."

"మాటల్ని మినహాయిస్తే మిగిలే వ్యక్తిత్వ మేమిటి?"

"అదేమరి! వాళ్లు చేసే పనుల్లో, వుండే తీరులో వుంటుంది. మాటలైనా వాటి వాచ్యార్థం కంటె వాటికి ఆ వ్యక్తి సంబంధమైన వ్యంగ్యార్థం వుంటుందే, అదీ వ్యక్తిత్వానికి కీలకం! తారకు నువ్వంటే యిష్టమే, కాని నిన్ను తనవాణ్ణిగా ఎలా చేసుకోవాలో తెలీక తనకు తోచిన మార్గంలో ప్రయత్నిస్తోంది..."

(సశేషం)